## నేషనల్ వాస్క్యులర్ డే వాకథాన్



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 7 ఆగస్టు 2025 | సంపుటి:9 | సంచిక:221 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

## ఏఐ.. పనిలో కొత్తదనం తెస్తుంది

చర్చనీయాంశమైన హర్ష్ గొయెంకా పోస్ట్



2

# మార్పులు స్వీకరిస్తూనే ముందుకు సాగాలి

## 'గ్రీన్ ఎనర్జీ' కాన్ఫరెన్స్‌లో మంత్రి లోకేశ్



**విజయవాడ,(మనం న్యూస్):** సమాజంలో నిత్యం మార్పులు వస్తున్నాయని, వాటిని స్వీకరిస్తేనే మెరుగైన ఉపాధి అవకాశాలుంటాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'గ్రీన్ ఎనర్జీ' కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. కృత్రిమ మేధ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో మరింత నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వ ఐటీ-ఐలను దత్తత తీసుకొని, ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు. 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నాం. నా పాదయాత్రలో ఎక్కడ చూసినా మహిళా

...మిగతా 2లో



# నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం



## ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

## 'స్త్రీశక్తి' పథకానికి 15న రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం

## అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు

- వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమి
- 40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- కేబినెట్ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి, (మనం న్యూస్):** రాష్ట్రంలో నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ సమాచార, ప్రసారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'స్త్రీ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వెల్లడించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించడంతోపాటు- తమ సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రులతో సీఎం చంద్రబాబు పంచుకున్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని.. అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. రూ.900 కోట్ల ఏపీ బీడీసీఎల్ రుణాలకు ప్రభుత్వ హామీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమిని ఇచ్చేందుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. మత్స్యకారులు,

...మిగతా 2లో

# ఈపీఎస్ కనీస పింఛనుపై త్వరలో ప్రకటన

## విశాఖ ఎంపీకి తెలిపిన కేంద్రమంత్రి



**విశాఖపట్నం, (మనం న్యూస్):** ఈపీఎస్-95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ కోరారు. ప్రభుత్వం రంగ సంస్థలు (పీఎస్‌యూ), ప్రైవేట్ రంగాల నుంచి పదవీ విరమణ చేసిన వేల మంది ఉద్యోగులు తక్కువ పెన్షన్‌తో జీవితాన్ని కొనసాగిస్తున్నారని కేంద్రమంత్రి దష్టికి తీసుకెళ్లారు. పెన్షన్ మొత్తం పెంపు, చెల్లింపుల వేగవంతం తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందిస్తూ.. పెన్షనర్లకు కనీస పెన్షన్ నిర్ణయంపై కేంద్రం త్వరలో కీలక ప్రకటన చేస్తుందని ఎంపీకి కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. ఉద్యోగ భవిష్య నిధి చందారులకు ఈపీఎస్-95 కింద చెల్లించే కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని చాలా ఏళ్లుగా

...మిగతా 2లో

# రాజకీయం అంటే ఇది.. పార్టీలు మారడం కాదు: వెంకయ్య నాయుడు




**విజయవాడ, (మనం న్యూస్):** బీజేపీ సీనియర్ కార్యకర్త వల్లూరు శ్రీమన్నారాయణ 56 ఏళ్లుగా పార్టీలో సేవలందిస్తున్న సందర్భంగా ఆయనకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరై, శ్రీమన్నారాయణ సేవలను ప్రశంసించారు. అడ్వానీ, వాజ్‌పేయి ప్రచారం చేసిన రోజులు గుర్తొస్తున్నాయన్నారు. శ్రీమన్నారాయణను తన వ్యక్తిగత స్నేహితుడిగా వెంకయ్య నాయుడు పేర్కొన్నాడు. జట్కా బండ్లపై తిరిగి వాజ్‌పేయి, అడ్వానీతో ప్రచారం

...మిగతా 2లో

# ట్రంప్ సుంకం..

# మరో 25 శాతం

- భారత్‌పై 50 శాతానికి చేరిన అమెరికన్ టారిఫ్
- రష్యా నుంచి చమురు కొంటున్నందుకేనని స్పష్టం చేసిన వైట్ హౌజ్ ప్రకటన



**న్యూయార్క్, ఆగస్టు 6:** భారత్‌పై మరోసారి సుంకం విధిస్తానంటూ పేలుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశాడు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మన దేశంపై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ సుంకం విధించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై బుధవారం ట్రంప్ సంతకం చేశారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా

...మిగతా 2లో

### మోడీ ధైర్యం చూపాలె: కాంగ్రెస్

తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని మోడీ మిత్రుడు ట్రంప్ నిరంతరం మన దేశంపై చర్యలు తీసుకుంటున్నా.. ప్రధాని మోడీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదంటూ విమర్శించింది. ఇప్పటికైనా మోడీ ధైర్యం చూపించాలని, ట్రంప్ చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

# లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం


### విచారణకు చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శివా రెడ్డి హాజరు



**విజయవాడ, (మనం న్యూస్):** లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ స్కాం కేసులో సిట్ ఎదుట విచారణకు చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివా రెడ్డి హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో మిథున్ రెడ్డి అరెస్టు తరువాత ఈ సంస్థ ప్రతినిధులను విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు వారు బుధవారం విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో వీరి సంస్థ ఖాతాల్లోకి డబ్బు బదిలి అయినట్లు- వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. ఈ విషయంపై ర ప్రాజెక్ట్స్ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుంటు-న్నారు సిట్ అధికారులు. లిక్కర్ స్కామ్ కేసులో

...మిగతా 2లో

# ఓటర్ల లిస్టుపై వివరణ ఇవ్వండి : ఈసీకి సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ,(మనం న్యూస్):** బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన ఎన్నికల కమిషన్ ఈనెల 1న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 65 లక్షల మందిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారంనాడు ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలను ఆగస్టు 9వ తేదీలోగా తమకు సమర్పించాలని ఆదేశించింది. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌ను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీఓ గతంలో సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ముసాయిదా

...మిగతా 2లో

## బనకచర్లతో తెలంగాణ ప్రజలకు నష్టం

- ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై రాజ్యసభలో బీఆర్ఎస్ వాయిదా తీర్మానాలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రాజ్యసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానాలను డిప్యూటీ చైర్మన్ హరివంశ్.. గోదావరిపై ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు వాయిదా తీర్మానం నోటీసులు ఇచ్చారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు నష్టం చేకూర్చుతుందని నోటీసుల్లో పేర్కొన్నారు. సభా కార్యకలాపాలు వాయిదా

## 28 మంది కేరళ పర్యాటకుల గల్లంతు

- ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన వందలాది మంది టూరిస్టులు

**డెహ్రాడూన్, ఆగస్టు 6:** ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదల కారణంగా 28 మంది పర్యాటకుల బృందం ఆచూకీ గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన మలయాళీలు కాగా.. మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు. ఈ బృందంలోని ఓ జంట బంధువు మీడియాతో మాట్లాడుతూ వారితో మాట్లాడి ఒక రోజు గడిచిందన్నారు. తాము మాట్లాడినప్పుడు "ఉత్తరకాశీ నుంచి ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు

...మిగతా 2లో

## ఎపిలో పలువురు మున్సిపల్కమిషనర్ల బదిలీ

**అమరావతి,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీలు, నియామకాలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గా ఎస్.రవీంద్ర బాబును నియమించింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్. వాసు బాబును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టీ-పీఆర్వోగా నియమించింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ గా జి. రవి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గా పి. భవానీ ప్రసాద్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ- సెక్రటరీ గా ఎల్ . సురేష్ లను నియమించింది. అలాగే సాలూరు మున్సిపల్ కమిషనర్ గా టి.టి.రత్నకుమార్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ- సహాయ కమిషనర్ గా డి. కొండయ్యలను

...మిగతా 2లో

# ట్రంప్‌వి అవగాహన లేని మాటలు



## డొనాల్డ్ 'డెడ్ ఎకానమీ' కామెంట్స్‌పై ఆర్బీఐ చీఫ్ సంజయ్ మల్హోత్రా

### ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత దేశమే ఎక్కువ దోహదం చేస్తోంది

**ఢిల్లీ, ఆగస్టు 6:** భారత దేశానిది 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన కామెంట్స్‌పై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తీవ్రంగా స్పందించారు. మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత్ ఎక్కువ దోహదం చేస్తోందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రకారం ప్రపంచ వృద్ధి 3శాతంగా ఉంటే.. భారత్ వృద్ధి అంచనాలు మాత్రం 6.5శాతంగా ఉన్నాయన్నారు. "ప్రపంచ వృద్ధికి భారత్ దాదాపు 18శాతం దోహదం చేస్తోంది. అమెరికా కంట్రిబ్యూషన్ 11శాతం కంటే తక్కువగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. మరింత పురోగతి సాధిస్తాం" అని ఆర్బీఐ గవర్నర్ పేర్కొన్నారు. అదేవిధంగా.. భారత జీడీపీపై అమెరికా సుంకాల ప్రభావం ఏమేరకు ఉంటుందన్న దానిపై మల్హోత్రా స్పందిస్తూ.. అమెరికా

...మిగతా 2లో

## జివిఎంసిలో వైకాపాకు షాక్

# స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి గెలుపు

## 10 స్థానాల్లో కూటమికి 9..వైకాపాకు ఒకటి

**విశాఖపట్నం, (మనం న్యూస్):** విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్, డిప్యూటీ-మేయర్ పీఠాలను ఇప్పటికే కూటమిలోని పార్టీలు కైవసం చేసుకోగా, బుధవారం తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల్లో సైతం మెజార్టీ స్థానాలు కూటమిలోని పార్టీ అభ్యర్థులకే దక్కాయి. మొత్తం 10 స్థానాల్లో తొమ్మిది కూటమి.. కేవలం ఒక్క స్థానం మాత్రం వైసీపీకి దక్కింది. అంటే 8 స్థానాల్లో టీడీపీ, ఒక్క స్థానంలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ అతి కష్టం మీద ఈ సీటును గెలుచుకుందని తెలుస్తోంది. ఇక ఈ జీవీఎంసీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే గతేడాది స్టాండింగ్ కమిటీ-ఎన్నికలలో

...మిగతా 2లో

# 31న చైనాకు మోడీ

2

# నేషనల్ వాస్క్యులర్ డే వాకథాన్

హైదరాబాద్, ఆగస్టు 6: నేషనల్ వాస్క్యులర్ డే సందర్భంగా బేగంటపేటలోని కిమ్స్-సన్ షైన్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. 'వాక్ ఏ మైల్ టు లివ్ విత్ ఏ స్మైల్' పేరుతో సంజీవయ్య పార్క్ నుంచి ప్రారంభమైన వాకథాన్‌ను నటుడు రాజీవ్ కనకాల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. భారతదేశంలో వాస్క్యులర్ సమస్యల వల్ల ఏటా సుమారు 25,000 మంది చేతులు, కాళ్లు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్న రోగులలో ఇది అధికంగా కనిపిస్తుందని, త్వరగా గుర్తించి వైద్యం తీసుకుంటే 80శాతం వరకు దీన్ని నివారించవచ్చని తెలిపారు.

# నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం పెంచామన్నారు. 40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు- తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కేబినెట్ మంత్రులను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఆగస్ట్ 15వ తేదీ.. స్వాతంత్ర దినోత్సవమని.. ఆ రోజు చాలా కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రులు విన్నవించారు. కానీ టైమ్ అడ్జెట్ చేసుకుని ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని వారికి సీఎం సూచించారు. ఇక ఈ కేబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీను ఆమోదించారు. అయితే కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం ప్రారంభానికి ముందే.. ఆటో డ్రైవర్లను పిలిపించి వారితో మాట్లాడాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో సూచించారు. ఈ సూచనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు-చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. వారితో మాట్లాడి తగిన సహాయం చేయాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు.వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారు.. అక్కడికి వెళ్లి సింగపూర్ మంత్రులను



బెదిరించారని చెప్పారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి జరిగిందని తెలిపారు. అలాగే సీడ్ క్యాపిటల్‌లో తాము భాగస్వామ్యం కాబోమని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వాళ్లని రమ్మని ఆహ్వానించామని తెలిపారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని వారిని సూచించినట్లు- పేర్కొన్నారు. అందుకు వాళ్లు సైతం ఒప్పుకున్నారని చెప్పారు.. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నానన్నారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్‌లో భాగంగా ఏపీకి పెట్టు-బడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు జులై 26 నుంచి 31వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో ఆయన వరుసగా భేటీ-లు నిర్వహించారు. ఆ క్రమంలో పెట్టు-బడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను వారికి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.

ఇక ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా పెట్టు-బడుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. అదే విధంగా ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ సంస్థలను సీఎం చంద్రబాబు సందర్శించిన విషయం విదితమే. ఈ సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట.. మంత్రులు నారా లోకేష్, టీ-జీ భరత్, పి నారాయణతోపాటు- పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పర్యటనను ముగించుకుని జులై 30వ తేదీన చంద్రబాబు, మంత్రులు లోకేష్, టీ-జీ భరత్‌లు అమరావతికి తిరిగి వచ్చిన విషయం తెలిసిందే.జగన్ ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్ ప్రభుత్వం భయపడిందని సీఎం చంద్రబాబు అన్నారు. సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని చెప్పారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం రాజకీయాంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం తేలిగ్గా అంగీకరించలేదన్నారు. వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు ఏడాదిగా సబ్జెక్టు నేర్చుకుంటూ మెరుగ్గా పనిచేశారు. ఇక హనీమూన్ కాలం వదిలి పాలనలో దూకుడు పెంచాలి. తప్పుడు వార్తల ప్రచారం, వైకాపా కుట్రలు, అతి తెలివైన నేరగాళ్ల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలి. మహిళలపై అసభ్య వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టాలి. అంతర్జాతీయ సంబంధాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు-చేస్తాం. సింగపూర్ విధానాల స్టడీకి మంత్రులు దశలవారీగా అక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత ఉంది. మంత్రుల పనితీరుతో అది మరింత పెరగాలి. ఎమ్మెల్యేలతో మాట్లాడా.. పొరపాట్లు- సరిదిద్దుకుంటామని చెప్పారు. జనసేన, భాజపా నేతలు కూడా లోపాలను సరిదిద్దుకోవాలి. మంత్రులు తమ శాఖలపై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసుకోవాలి. వచ్చే క్యాబినెట్ భేటీలో ప్రతి మంత్రితో వారి శాఖపై మాట్లాడిస్తా అని చంద్రబాబు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు టికెట్ నమూనాను ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చూపించారు.

# ఏఐ పనిలో కొత్తదనం తెస్తుంది

- చర్చనీయాంశమైన హర్ష్ గొయెంకా పోస్ట్

హైదరాబాద్, ఆగస్టు 6: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వల్ల ఉద్యోగాలు పోతాయని సర్వత్రా ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయెంకా ఎక్స్‌లో పెట్టిన పోస్టు చర్చనీయాంశమైంది. అయితే ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్లు, ఏఐ విలువల నిపుణులు వంటి కొత్త ఉద్యోగాలు పుట్టే అవకాశం ఉందన్నారు. కార్యాలయాల రూపురేఖలు మారతాయన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని అభిప్రాయం వ్యక్తంచేశారు. గొయెంకా చెప్పినట్లుగా ఏఐ ఉద్యోగాల తొలగింపునకు కాకుండా.. నూతన ఉద్యోగ మార్కెట్కు తెర తీస్తోందని ఓ నెటిజన్ స్పందించారు. 'కాప్జెమిని' వంటి కంపెనీలు ఫ్రెషర్లను నియమించుకుం టున్నాయన్నారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. ఏఐ ప్రతి రంగంలో ఉత్పాదకతను పెంచుతుందని.. పెట్టుబడిపై రాబడిని మెరుగుపరుస్తుందన్నారు. దీనివల్ల ఆర్థికవృద్ధి సైతం పెరుగుతుందని పేర్కొన్నారు. కంటెంట్ క్రియేషన్, కోడింగ్, డిజైనింగ్ రంగాల్లో ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగాలపై కొంతమేర ప్రభావం పడుతుందని మరో నెటిజన్ అభిప్రాయపడ్డారు. ఇలా గోయెంకా పోస్ట్‌పై కూడా విభిన్న రకాల స్పందనలు.. వాటిలో ఆందోళనలు వ్యక్తం అవుతుండడం గమనార్హం.

# ట్రంప్‌వి అవగాహన లేని మాటలు



(మొదటి పేజీ తరువాయి)

సుంకాల ప్రభావాన్ని ప్రస్తుతం అంచనా వేయడం కొంచెం కష్టమేనన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు మాత్రం వృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మనం ప్రతీకార సంకాలు విధిస్తే తప్ప.. మన ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం ఉండదని చెప్పారు. ''వృద్ధిపై ఇప్పటికే అంచనాలు చాలా వరకు తగ్గించాం. అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో వృద్ధి అంచనాలను 6.7శాతం నుంచి 6.5శాతానికి సవరించాం. అయినప్పటికీ అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న క్రమంలో సుంకాల ప్రభావం ఏ విధంగా ఉంటుందన్నది అంచనా వేయడం కష్టమే. సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తాం. ప్రస్తుతానికి జీడీపీ అంచనాలను సవరించడానికి మా వద్ద తగినంత డేటా లేదు'' అని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై..

ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఆర్బీఐ చీఫ్ మాట్లాడుతూ.. స్థూల ఆర్థిక పరిస్థితులను విధానపరమైన అంశాల వారీగా పర్యవేక్షిస్తూనే ఉంటామన్నారు. వాటికి తగినట్లు నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం చాలా అనిశ్చితి కొనసాగుతోందని, వడ్డీ రేట్లలో 100 బేసిస్ పాయింట్లు ఇదివరకే తగ్గించామన్నారు. ధరల స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే స్థిర వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చర్చల గురించి మాట్లాడుతూ.. అవి సామరస్యంగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజకీయం అంటే ఇది.. పార్టీలు మారడం కాదు: వెంకయ్య నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన రోజులలో నుంచే శ్రీమన్నారాయణ బీజేపీ కోసం పదవుల ఆశ లేకుండా, కేవలం సిద్ధాంత నిబద్ధతతో పని చేశారని గుర్తు చేశారు.

### ఆదర్శంగా ఉండాలి

రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. అయితే, నేటి రాజకీయ పరిస్థితుల్లో ఎవరూ ఏ పార్టీకి చెందిన వారో స్పష్టంగా తెలియని స్థితి ఉందని కామెంట్స్ చేశారు. పార్టీ మారే నాయకుల పరిస్థితి బస్సుల రాకపోకల లాగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. గతంలో నాయకులు ఒక పార్టీ విడిచి మరొకదాన్ని చేరేటప్పుడు సిద్ధాంతాలు, కారణాలు ఉండేవని కానీ.. నేడు, డైపర్లు మార్చినంత సులువుగా పార్టీలు మారుతున్నారని విమర్శలు గుప్పించారు. ఇది రాజకీయాలకు తగదని వ్యాఖ్యానించారు. శ్రీమన్నారాయణ నిబద్ధత ప్రతి కార్యకర్తకు ఆదర్శమని పేర్కొన్నారు.

### నమ్మకం పోతుంది

ఒక పార్టీని నమ్మి, ఆ పార్టీ కోసం పని చేసేవారే నిజమైన నాయకుడన్నారు. రాజకీయ నాయకులకు సమయ పాలన కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు మనలను ఆదర్శంగా తీసుకునేలా ఉండాలని చెప్పారు. ఈ క్రమంలోనే నేడు వివాహ వ్యవస్థపై కూడా నమ్మకం పోతుందన్నారు. మన కుటుంబ, వివాహ వ్యవస్థ చూసే ప్రపంచ దేశాలు గౌరవిస్తాయని.. కానీ, ఇప్పుడు ఫిజిక్స్ చూసి పెళ్లిళ్లు ... కెమిస్ట్రీ బాగాలేదని విడాకులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పని అయినా ఇష్టపడి చేస్తే... కష్టం అనేది ఉండదని, ఈ విషయంలో శ్రీమన్నారాయణ చాలా మందికి ఆదర్శమని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు నడవడిక, పని తీరును ప్రజలు గమనించాలని సూచించారు.

### విలువలతో బతకాలి

ఎదుటి వారితో గౌరవ మర్యాదలు పాటిస్తే.. అదే గౌరవం మనకీ దక్కుతుందన్నారు. కుటుంబం అంతా కలిసి అన్యోన్యంగా ఉంటే ఆ బలమే వేరని, ఎవరితో అయినే స్నేహం మనకను రెప్ప లాగా ఉండాలని, ఎప్పుడు అవసరం వచ్చినా కనురెప్ప లాగా ఆ కష్టానికి అడ్డంగా నిలబడాలని సూచించారు. శ్రీమన్నారాయణ అందరినీ గౌరవిస్తూ... సహకరిస్తూ.. తన ప్రత్యేకతతో అందరికీ ఆప్తులుగా మారారన్నారు. అటువంటి వ్యక్తి అభినందన సభలో పాల్గొనాలనే తాను ఈరోజు సభకు వచ్చినట్లు తెలిపారు. ఎవరైనా సరే కొన్ని విలువ లతో బతకాలని... రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండేలా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ నడక, వ్యాయామం, యోగా చేయాలన్నారు. శ్రీమన్నారాయణ ఇలాగే నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ వందేళ్లు ఆనందంగా ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు.

# మార్పులు స్వీకరిస్తూనే ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు కనిపించారు. కియా వచ్చాక వేలమంది మహిళలకు ఉపాధి దొరికింది. పిల్లలను బాగా చదివించుకునేందుకు మహిళలు



కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాలు చేస్తేనే ఇంటా బయటా వారికి గౌరవం పెరుగుతుందని మంత్రి లోకేశ్ అన్నారు.

# ఓటర్ల లిస్టుపై వివరణ ఇవ్వండి: ఈసీకి సుప్రీం ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ల జాబితా అనంతరం మరోసారి కోర్టును ఆశ్రయించింది. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను ఇచ్చినప్పటికీ ఓటర్ల తొలగింపునకు కారణాలు చెప్పలేదని ఎన్జీపీ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తమ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ, తొలగించిన ఓటర్ల జాబితా వివరాలు ఇప్పటికే రాజకీయ పార్టీలకు ఇచ్చినందున ఆ వివరాలను ఎన్జీవోకు కూడా అందించాలని ఈసీ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం జాబితా వివరాలను అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వివరిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఈపీఎస్ కనీస పింఛనుపై త్వరలో ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్లు వస్తున్నాయి. పెన్షన్ మొత్తాన్ని కనీసం రూ.7 వేలకు పెంచాలని ఈపీఎస్-95 ఆందోళన కమిటీ ఎప్పటి నుంచో కోరుతోంది. దిల్లీ వేదికగా పలుమార్లు ఈ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా నిర్వహించారు. పెన్షనర్లు, వారి జీవిత భాగస్వామికి ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలన్న డిమాండ్ కూడా ఉంది. కేంద్రం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటే దేశంలో సుమారు 80 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

# లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

(మొదటి పేజీ తరువాయి)

మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిన్న వాదనలు ముగిశాయి. ఇరువైపు వాదనలు విన్న ఏసీబీ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో అరెస్టయిన ఆయన.. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# ఎపిలో పలువురు మున్సిపల్కమిషనర్ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

నియమించింది. కదిరి మున్సిపాలిటీ- శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి ప్రహ్లాద్ ను కమలాపురం మున్సిపల్ కమిషనర్ పోస్టుకు బదిలీ చేస్తూ.. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ దిశగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ను ఆదేశించారు.

# మరో 25 శాతం

(మొదటి పేజీ తరువాయి)

చమురు కొనుగోళ్లు జరుపుతున్నందునే ఈ టారిఫ్ విధిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల్లో భాగంగా ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానుండగా.. కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపజేస్తున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో పేర్కొన్నారు. ఒకవేళ ఈ సుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదైనా సుంకాలు వడ్డించాలని ప్రయత్నిస్తే ఈ టారిఫ్‌లను అధ్యక్షుడు సవరించొచ్చని వైట్ హౌజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దీనిపై కేంద్రం ఏవిధంగా బదులిస్తుందో చూడాలి.

### చైనా తర్వాత మనపైనే..

దీంతో చైనా తర్వాత ఆసియాలో అత్యధిక టారిఫ్ లు ఎదుర్కొంటున్న దేశంగా భారత్ నిలిచింది. ప్రస్తుతం చైనా ఉత్పత్తులపై 51 శాతం సుంకం అమెరికా విధిస్తోంది. మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30, వియత్నాంపై 20 శాతం, ఇండోనేసియాపై 19 శాతం చొప్పున ట్రంప్ టారిఫ్ విధించారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా జపాన్ పై 15 శాతం టారిఫ్ ప్రకటించారు.

# బనకచర్లతో తెలంగాణ ప్రజలకు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

వేసి బనకచర్లపై చర్చించాలన్న బీఆర్ఎస్ ఎంపీలు కోరారు. ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ పార్టీ సైలెంట్‌గా ఉందన్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ మరోసారి పోరుబాట పట్టినట్లు చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం దగ్గర తాకట్టు పెట్టారని.. ఈ ప్రాంత రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇప్పటికే బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే అన్యాయాన్ని బీఆర్ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్‌తో పాటు పలు వేదికలపై ఏపీని ఎండగడుతున్నట్లు పేర్కొన్నారు.

# 28 మంది కేరళ పర్యాటకుల గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత నుంచి వారితో ఎటువంటి కాంటాక్టు లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా.. లేక వారున్న చోట సిగ్నల్ లేదా అనేది అర్థం కావడంలేదు'' అని పేర్కొన్నారు. గంగోత్రికి వెళ్లే మార్గంలో ధరాలీ కీలకమైన స్టాప్. నిన్న భారీగా మెరుపు వరద విరుచుకుపడింది. క్షణాల్లో భవనాలు మట్టి కింద కూరుకుపోయాయి. ఇప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. డజన్ల మంది ఆచూకీ గల్లంతైంది.

# స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఈ సారి మాత్రం కూటమి తొమ్మిది స్థానాలను -కై-వసం చేసుకుంది. ఈ రోజు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు ఈ ఓటింగ్ పక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 92 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు- తెలుస్తుంది. అందుకే వైసీపీ ఘన విజయం సాధించిందనే వాదన వినిపిస్తోంది. ఎందుకంటే.. గతేడాది జరిగిన ఇవే ఎన్నికల్లో 10కి 10 స్థానాలు కూటమిలోని పార్టీలు గెలుచుకున్నాయి. కానీ ఈ సారి ఒక స్థానాన్ని కూటమి కోల్పోయింది. ఇక ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. అలాగే ఒక్క స్థానాన్ని ఎందుకు కోల్పోయామనే అంశంపై సైతం సమీక్షించు కుంటామని కూటమిలోని పార్టీల నేతలు పేర్కొన్నారు. దీంతో జీవీఎంసీలో కూటమి పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్నట్లు అయింది.

# 31న చైనాకు మోడీ

ఖరారైన ప్రధాని పర్యటన షెడ్యూల్

షాంఘై సహకార సదస్సు సందర్భంగా షీ జిన్‌పింగ్‌తో భేటీ

ఢిల్లీ, ఆగస్టు 6: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోడీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో తొలిసారి బీజింగ్ వెళ్లిన భారత ప్రధాని ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనిక ుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది.



# అమ్మ వారికి వెండి తుంగవాళికలు బహుకరణ

తిరుచానూరు, ఆగస్టు 06(మనం న్యూస్): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి కెనడాకు చెందిన రమణారావు బుధవారం రెండు వెండి తుంగవాళికలను బహుకరించారు. సుమారు 4.144 కేజీల వెండితో తయారు చేసిన తుంగవాళికలను ఆలయ ఏఈవో దేవరాజులు, ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, అర్చకులు బాబు స్వామిలకు దాత అందజేశారు. వీటి విలువ సుమారు 6 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

- కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్: బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు. బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగతి కార్యాచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ





**తిరుమల, ఆగస్టు 06(మనం న్యూస్) :** తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు.

ఆ తరువాత సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం, వేద ఘోష,మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామివారికి, వకుళమాత అమ్మవారికి, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులవారికి, యోగనరసింహస్వామి వారికి, భాష్యకార్లకు, పోటు తాయారుకు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామివారికి, శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి పవిత్రమాలలు సమర్పించారు. అనంతరం, సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది.

చారిత్రక ఆధారాల ప్రకారం శ్రీస్వామివారి ఉత్సవమూర్తులకు కావలసిన పవిత్రాలు చేయడానికిగాను శ్రేష్టమైన జాతి పత్తి మొక్కలను అత్యంత పవిత్రమైన దైవమొక్కగా భావించే తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచడం విశేషం. పవిత్రాలను తయారు చేయడానికి 20 మూరల పట్టుదారం గానీ లేదా 200 మూరల నూలుదారం గానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు అద్దకం చేస్తారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయాల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, ఆదనపు ఈవో సి.హెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత ఛత్ర స్థాపనోత్సవం

**తిరుమల,ఆగస్టు 06(మనం న్యూస్) :** తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత బుధవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవారి పాదాల వద్ద టిటిడి అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్టించారు.

ముందుగా తిరుమల శ్రీవారి ఆలయంలో రెండో గంట తర్వాత పూజ సామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల గుండా మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడి నుండి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం చేపట్టారు. అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ద్వాదశి నాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహించారు.

ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా.. చాముండేశ్వరీ.. చెవిరెడ్డిని కాపాడు తల్లీ

- **కొబ్బరి కాయలు కొట్టిన వైఎస్సార్సీపీ నేతలు**

తిరుపతి రూరల్, ఆగస్టు 06(మనం న్యూస్) : ''అమ్మా.. శక్తి చాముండేశ్వరీ.. అక్రమ కేసులో జైలుకు వెళ్లిన చెవిరెడ్డిని కాపాడు తల్లీ.. ఆయనను అక్రమంగా నిర్బంధించి 50 రోజులు గడిచింది.. ఆయన ఆరోగ్యం కాపాడి త్వరగా బయటకు వచ్చేలా అనుగ్రహించు.. తల్లీ'' అంటూ చంద్రగిరి నియోజకవర్గంకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కొబ్బరికాయలు కొట్టి ప్రార్థించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట సమీపంలోని శ్రీశక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం చెవిరెడ్డి భాస్కర్ రెడ్ పేరిట అర్చన చేయించి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు అమ్మవారికి 216 కొబ్బరికాయలు కొట్టి తమ నాయకుడు చెవిరెడ్డి త్వరగా బయటకు రావాలని ప్రార్థించారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. జగన్మోహన్రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. సీఎం.. డౌన్.. డౌన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ తప్పుడు కేసులో చెవిరెడ్డిని నిర్బంధించి 50 రోజులు గడిచిపోయాయని, ఆయన ఆరోగ్యం బాగుండాలని, అక్రమ కేసులో ఆయనకు త్వరగా బెయిల్ రావాలని అమ్మవారిని ప్రార్థించామన్నారు. కలం, మతం, పార్టీ, ప్రాంతం అన్న బేధాలు లేకుండా అందరికీ మంచి చేసిన చెవిరెడ్డిని జైలు గోడలు మధ్యన బంధించడం దుర్మార్గమన్నారు. చెవిరెడ్డి వంటి నాయకుడు ఈ రాష్ట్రంలో లేరన్న నిజం ఆయన గురించి బాగా తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే మనస్సున్న నాయకుడు చెవిరెడ్డి మాత్రమేనన్న నిజం ఈ నియోజకవర్గంలో ఎవ్వరిని అడిగినా చెబుతారన్నారు. చెవిరెడ్డిని తప్పుడు కేసులో ఇరికించి జైలు గోడలు మధ్యన బంధించినంత మాత్రాన ఆయన పేరును జనం మరువరన్న విషయం కూటమి పెద్దలు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. చెవిరెడ్డిని విడుదల చేసేంత వరకు తాము పోరాడుతూనే ఉంటామని, ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి చెవిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వివరించి కూటమి పెద్దల కుట్రలు బయటపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు మునీశ్వరరెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవ రెడ్డి, నల్లందుల సుధాకర్ రెడ్డి, ఆర్సీపురం జడ్పీటీసీ ఢిల్లీ రాణి, భానుకుమార్ రెడ్డి, దామినేటి కేశవులు, చిలమంద మునిక్రిష్ణ, చిన్ని యాదవ్, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, సింహాల మోహన్, నాగార్జున రెడ్డి, హేమేంద్ర కుమార్ రెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, పాకాల ఎంపీపీ లోకనాథం, చెంగల్ రెడ్డి, నంగా నరేష్ రెడ్డి, కపిలేశ్వర రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, చెంచుమోహన్ యాదవ్, మొక్కల భారతి, నాగభూషణమ్మ, మన్నూరు లక్ష్మీ శివ, శెల్వం, శివశంకర్ రాజు, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, ఉమాపతి, సుధాయాదవ్, మస్తాన్, ఒంటి శివశంకర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కోటీశ్వరరెడ్డి, దేవరాజులు రెడ్డి, భాస్కర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాజేష్, జోగి మోహన్ లతో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## శ్రీవారి సన్నిధిలో రమ్యకృష్ణ

**తిరుమల, ఆగస్టు 06(మనం న్యూస్) :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం ప్రముఖ సినీ నటి రమ్యకృష్ణ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూ లైన్ ద్వారా ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల సినీ నటి రమ్యకృష్ణ ను చూసేందుకు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

## టీటీడీ ఉద్యోగులను వేధింపులకు గురి చేయొద్దు

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

**తిరుమల, ఆగస్టు 06(మనం న్యూస్) :** తిరుమల తిరుపతి దేవస్థానంలో గత కొద్ది కాలంగా టీటీడీ ఉద్యోగులను యాజమాన్యం వేధింపులకు గురిచేస్తున్నదని ఈ వైఖరిని తక్షణం మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో టీటీడీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడంలో అత్యుత్సాహాన్ని చూపుతున్న టీటీడీ, వారి సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ముందుచూపుతో వ్యవహరించకుండా బాధ్యతా రాహిత్యంగా ఉందని మురళి ఆరోపించారు. టీటీడీలో పర్మినెంట్ ఉద్యోగులు 15 వేల మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 6000 మంది ఉన్నారని సుమారు 8500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆరోపించారు. ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతున్నా, ఉద్యోగుల సంఖ్య కుదించుకుపోవడం దారుణమని అన్నారు.



గత పదేళ్లలో భక్తులు వేల నుంచి లక్షల మందికి పెరిగారని గుర్తు చేశారు. కాటేజీలు, గెస్ట్ హౌస్ లు, రోడ్లు, భవనాలు, కార్యాలయాలు, పార్కులు, విద్యాలయాలు, ఆసుపత్రులు, సంస్థలు, స్కీములు, విపరీతంగా పెరిగాయని పనిభారానికి అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య పెరగలేదని గుర్తు చేశారు. వాస్తవం ఇది కాగా పెరిగిన పని భారం నుంచి తప్పించడానికి... ప్రజలు, భక్తులు, అధికారుల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచకుండా నలుగురి పనిని ఒకరి దగ్గర చేయిస్తున్నారని ఈ కారణంగా 4వ తరగతి ఉద్యోగులు అల్లాడిపోతున్నారని అన్నారు. అధికారులు, సిబ్బంది పని భారంతో ఇబ్బంది పడుతున్నా వాటి గురించి చర్చించటం, ఆ అవసరాలు తీర్చటం మాని అనవసర విషయాలపై రాద్ధాంతాలు చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టటం ఓ ఆనవాయితీగా యాజమాన్యం మార్చుకోవడం దురదృష్టకరమని అన్నారు. స్విమ్స్ ఆసుపత్రిలో 35 మంది ఉద్యోగులకు అన్యమతస్తులు అంటూ నోటీసులు జారీచేసి వేధింపులకు గురిచేస్తూ సర్టిఫికెట్లు చూపించమని, పాఠశాలలకు వెళ్లి తనిఖీలు చేస్తూ మానసిక ఇబ్బందికి టీటీడీ విజిలెన్స్ విభాగం వారు గురి చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. టీటీడీ లోని అన్ని విభాగాలలోని ఉద్యోగుల్లో యాజమాన్యం పట్ల తీవ్రమైన అసంతృప్తి ఏర్పడిందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించటం చేతగాక, ఉన్న ఉద్యోగులలో కొందరిని వివరణ కూడా కోరకుండా స్వల్ప కారణాలతో సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు పేరిట ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో 18 మందికి పైగా ఉద్యోగులను సస్పెండ్ చేయడం, పలువురికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వత్తిడి కారణంగా అనేకమంది ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చిన్న వయసులోనే గుండెపోటు కు గురై ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తక్షణం యాజమాన్యం ఈ వైఖరిని మానుకోకుంటే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని కందారపు మురళి ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## శ్రీవారిని దర్శించుకున్న సిక్కిం సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్



**తిరుమల, ఆగస్టు 06(మనం న్యూస్):** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు డైరీ, క్యాలెండర్ను అందజేశారు. అనంతరం, ఆలయం వెలుపల ప్రేమ్ సింగ్ తమాంగ్ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత భారతదేశంలోని అత్యంత పవిత్రమైన మరియు ఆధ్యాత్మికంగా ముఖ్యమైన తీర్థయాత్ర ప్రదేశాలలో తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించే అరుదైన అవకాశం తనకు లభించిందని సిక్కిం ప్రజల తరపున ప్రార్థనలు చేయడం నాకు చాలా సంతోషాన్ని కలిగించిందని సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ అన్నారు.

## పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో టీటీడీ చైర్మన్ తనిఖీలు

**తిరుపతి, ఆగస్టు 06(మనం న్యూస్) :** తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అత్యవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళా జూనియర్ కళాశాలలో తిరుపతి జేఈవో వి. వీరబ్రహ్మం, టిటిడి బోర్డు మెంబర్ జి. భానుప్రకాష్ రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ, మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, విద్యార్థినులు ప్రాథమిక అవసరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను టిటిడి తిరుపతి జేఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి అన్నింటిపై నివేదిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుకునేందుకు కళాశాల పరిసరాలు చాలా బాగున్నాయన్నారు. అదేవిధంగా ఈ కళాశాలలో ఉత్తీర్ణత శాతం చాలా అద్భుతంగా ఉందని అభినందించారు. ముఖ్యంగా కళాశాలలో విద్యార్థినులకు హాస్టల్ సామర్థ్యాన్ని, వసతి సౌకర్యాన్ని పెంచాలని, వైద్య సౌకర్యాల పెంపు, వేడి నీటి కోసం సోలార్ వాటర్ హీటర్స్, ఈ - లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటు, హాస్టల్ లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యూకేషన్ సౌకర్యం తదితర అంశాలపై అధికారులు నివేదిక తయారు చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు టిటిడి ఛైర్మెన్ సూచించారు. అంతకుముందు టిటిడి ఛైర్మెన్ బీ.ఆర్ నాయుడు అధికారులతో కలిసి కాలేజీ పరిసరాలను, వంట గది, హాస్టల్ ప్రాంతాలను తనిఖీ చేశారు. అటు తరువాత విద్యార్థినులు, తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు.



# డ్రోన్ నిఘాతో మత్తు మాయాజాలం బట్టబయలు

- **మత్తు ఇంజక్షన్లతో సహా పోలీసుల అదుపులో ఆరుగురు యువకులు**

**తిరుపతి రూరల్, ఆగస్టు 06(మనం న్యూస్) :** తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎంఆర్.పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బైరాగిపట్టెడ, వాణినగర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా పరిశీలన చేపట్టగా, వాణి నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో చెట్లు, పొదల మధ్య ఆరుగురు యువకులు కూర్చున్న దృశ్యాన్ని డ్రోన్ కెమెరా సిబ్బంది గుర్తించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి ఆచరణపై ప్రత్యేక బృందం, స్థానిక పోలీసులతో కలిసి అక్కడే తనిఖీ చేపట్టారు. పరిశీలనలో ఆ యువకులు చేతులకు మత్తు ఇంజక్షన్లు ఎక్కించుకుంటున్నట్లు స్పష్టం కావడంతో వారిని అక్కడికక్కడే అదుపులోకి తీసుకుని ఎంఆర్.పల్లి పోలీస్ స్టేషన్కు



తరలించారు. పోలీసులు మత్తు ఇంజక్షన్ల మూలాలను గుర్తించేందుకు విచారణ ప్రారంభించారు. ఈ ఇంజక్షన్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సరఫరా చేస్తున్నారు? వీటి వెనుక ఉన్న ముఠా ఎవరిది? అన్న కోణాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదనంగా, యువకుల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. మత్తు అలవాట్లకు బానిసలవుతున్న యువతను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనీ, అవసరమైతే పోలీసులు స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చి రీహాబిలిటేషన్ సెంటర్లకు పంపించే ఏర్పాట్లు ఉన్నాయని వారికి వివరించారు. మీ పిల్లలు ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని పోలీసు అధికారులు తెలిపారు. ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలనీ, ఎవరైనా మత్తు పదార్థాల బానిసలై ఉన్నారని తెలిసినపక్షంలో 8099999977 నంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

మనం Manam


## ముఖ పుస్తకం

ఎన్నెన్ని ముఖాలను దాచుకుందో
ఎన్నెన్ని రంగుల్ని పోగేసుకుందో
అరచేతి మాయా దర్పణంలా మారి
ఎంతమందిని నాలోకి కలిపేసిందో
ఎన్ని చిత్రాలను కనువిందు చేసిందో
ఉన్నవి లేనివి అన్నింటినీ కలిపేస్తూ
కొత్త హంగుల ప్రపంచాన్ని చూపించింది


రూపురేఖలకు సున్నం కొట్టేస్తూ
ఎంతబాగా మైకం కమ్మించిందో
అక్షరాలతో మాట్లాడిస్తూ
ఎంత ఈజీగా లక్షణాల్ని దాచేసిందో
మంచి చెడును తెరపైన కలిపేస్తూ
ఎంత కమ్మగా నమ్మకాన్ని సృష్టించిందో
ముఖాముఖిలో ఆనందాన్ని
ముచ్చటగా మోముపై పరిచేస్తూ
ఎంత తెలివిగా చేయి చేయి కలిపిందో

ముఖ పుస్తకంలో పేజీలకు సంఖ్య లేదు
తిరగేసే కొద్దీ కొత్త కొత్త పరిచయాలు
వాక్యాలుగా పుట్టుకొస్తాయి
ఎంత చమత్కారంగా పలకరిస్తుందో
ఎంత వయ్యారంగా కళ్ళను మెప్పిస్తుందో
అలసిపోని చేయి సొలసిపోని మనసు
నిండుగా దండిగా వుండాలే గానీ
కొత్తబంగారులోకం చూపించేస్తుంది

గాలికెగిరే చెత్తకు కూడా రంగులద్ది
ఆకర్షణతో చుట్టూ తిప్పుకుంటుంది
ఎంత చిక్కగా అల్లుకుపోతుందో
ఎంత గొప్పగా కళ్ళను నమ్మిస్తుందో
పాతాళంలో వున్నా కూడా
ప్రపంచానికి పరిచయం చేస్తుంది
అతికించిన బొమ్మలతో కనువిందు చేసి
మతి చెదిరే విన్యాసం చేయిస్తుంది
ఎంత నిండుగా హత్తుకుపోతుందో
ముఖ పుస్తకమంటే మాటలు కాదుగా

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

# హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



భారత వ్యవసాయ రంగాన్ని శాశ్వతంగా మార్చిన మహా మానవుల్లో అగ్రగణ్యుడు డాక్టర్ మంకొంబు సాంబశివన్ స్వామినాథన్. దేశానికి హరిత విప్లవాన్ని అందించిన శాస్త్రవేత్తగా, రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మార్గదర్శిగా, పౌరహక్కుల పరిరక్షకుడిగా, ఆయన వ్యక్తిత్వం విశ్వ వ్యాప్తి సాధించింది. ఆయన శాస్త్రీయ విజ్ఞానం, దూరదృష్టి, రైతుల పట్ల గల అపారమైన ప్రేమ భారత దేశాన్ని ఆహార దిగుమతి దారుడిగా ఉండే స్థితి నుంచి ఆహారస్వావలంబ దేశంగా తీర్చిదిద్దింది. 1925 ఆగస్టు 7న తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని కంబం గ్రామంలో జన్మించిన స్వామినాథన్ పూర్తి పేరు మంకొంబు సాంబశివన్ స్వామినాథన్. తండ్రి ఎం.కే. సాంబశివన్ ప్రఖ్యాత వైద్యుడు. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ వైద్యవృత్తిలో ప్రవేశించాలన్న ఆలోచన కలిగిన స్వామినాథన్, 1943లో బెంగాల్లో సంభవించిన తీవ్ర కరువు దృశ్యాలను చూసి చలించిపోయి, వ్యవసాయ రంగాన్ని తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్నారు. మద్రాస్ యూనివర్సిటీలో ప్రాకృత శాస్త్రంలో పట్టభద్రుడైన తరువాత, న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్లో వ్యవసాయ శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశారు. అనంతరం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విత్తన శాస్త్రంపై అధ్యయనం కొనసాగించి, నార్మన్ బోర్లాగ్ ప్రభావంతో మెక్సికన్ గోధుమ వంగడాలపై ప్రయోగాలు ప్రారంభించారు.

భారతదేశం 1960వ దశకంలో తీవ్రమైన ఆహార కొరతతో బిక్కుబిక్కు మంటున్న వేళ, విదేశాల నుంచి గోధుమల దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి సమయంలో నార్మన్ బోర్లాగ్ అభివృద్ధి చేసిన పొట్టి గోధుమ జాతులను భారత భూముల కనుగుణంగా మార్చి, దేశ వ్యాప్తంగా అధిక దిగుబడి విత్తనాలను అభివృద్ధి చేసి, రైతులకు అందించడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. ఇందిరా గాంధీ ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించిన ఆయన సూచనలతో దేశవ్యాప్తంగా హరిత విప్లవం విస్తరించ గలిగింది. గోధుమలతో పాటు బియ్యం, మక్క, జొన్న వంటివి కూడ అధిక దిగుబడిగా పండించ గలగడం వల్ల దేశం ఆహార భద్రత పరంగా స్వయం సమృద్ధిని సాధించింది. వ్యవసాయ ఉత్పాదకత పెరిగినా, అది రైతుల జీవితాల్లో అనుకూల మార్పులు తీసుకురావలసిన అవసరాన్ని గుర్తించిన స్వామినాథన్, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో పాలకులకు మార్గ నిర్దేశం చేశారు. 2004లో ఏర్పడిన రైతులపై జాతీయ సంఘానికి (National Commission on Farmers) అధ్యక్షత వహించిన ఆయన సూచనలతోనే వెలువడిన నివేదికలు స్వామినాథన్ కమిషన్ నివేదికలుగా ప్రసిద్ధిపొంది, నేటికీ రైతు ఉద్యమాలకు ఆధారంగా నిలిచాయి. ఆ నివేదికల్లో సూచించిన కనీస మద్దతు ధర (MSP) విధానం, రైతుల ఆదాయ భద్రతకు అవసరమైన చట్టపరమైన హామీ, సాగు భూమి పరిమితులు, వ్యవసాయ రుణ భారం, నీటి వనరుల సమగ్ర విధానం వంటి అంశాలు విపరీత ప్రాధాన్యతను సంపాదించాయి.

హరిత విప్లవ ఫలితంగా ఉత్పాదకత పెరగడం వలన రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగి, పర్యావరణానికి, భూమికి హాని కలుగుతున్నదీ ఆయన ముందుగానే గుర్తించారు. అందుకే 1990లో సతత హరిత విప్లవం అనే భావనను ప్రతిపాదించారు. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు నేల ఆరోగ్యాన్ని, నీటి వినియోగ సమర్థతను మెరుగు పరచే విధానాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ సిద్ధాంతంతో వ్యవసాయాన్ని దీర్ఘకాలికంగా సుస్థిరంగా కొనసాగించ వచ్చన్న భావనను ప్రచారంలోకి తెచ్చారు. మద్రాసులో స్థాపించిన ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్రామీణ శాస్త్రీయ పరిజ్ఞాన వికేంద్రీకరణకు, జీవవైవిధ్య పరిరక్షణకు, మహిళల ఆర్థిక శక్తి వృద్ధికి, పేదల జీవితాలలో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఎంతో కృషి చేసింది. ఇదే సమయంలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IRRI), ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO) వంటి సంస్థలకు ఆయన సేవలందించారు.

స్వామినాథన్ జీవితంలో అనేక గౌరవాలు వరుసగా వచ్చాయి. పద్మశ్రీ (1967),రామన్ మెగసెసే అవార్డు (1971), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989), ప్రపంచ ఆహార బహుమతి -(World Food Prize) తొలి విజేతగా (1987), ఇందిరా గాంధీ శాంతి బహుమతి (1999), ఫారిన్ అసోసియేట్ ఆఫ్ యుఎస్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వంటి పురస్కారాలు ఆయన సేవలకు గుర్తింపుగా లభించాయి. చివరికి 2024లో భారత ప్రభుత్వం ఆయనకు మరణానంతరంగా అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించింది. ఇది దేశ వ్యవసాయానికి చేసిన అపూర్వ సేవలకు భారత జనత ఇచ్చిన మహోన్నత కృతజ్ఞత.

2023 సెప్టెంబరు 28న 98 సంవత్సరాల వయస్సులో స్వామినాథన్ మద్రాసులో తుదిశ్వాస విడిచారు. భారత వ్యవసాయ రంగానికి గానే కాక, రైతు జీవితానికి, సమాజానికి, భవిష్యత్ ఆహార భద్రతకు ఆయన చూపిన మార్గం చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఆయన నమ్మకం - వ్యవసాయం అనేది కేవలం ఆహార ఉత్పత్తికి మాత్రమే కాదు, అది జీవన విధానానికి మూలాధారం అనే సిద్ధాంతం నేటి సమస్యల సమాధానాల్లో వెలుగు చూపిస్తోంది. మంకొంబు సాంబశివన్ స్వామినాథన్ గారు ఒక శతాబ్దపు శాస్త్రవేత్త మాత్రమే కాక, సార్వభౌమ రైతు హక్కుల చైతన్య దాతగా భారత చరిత్రలో అక్షరాల చిరస్థాయిగా నిలిచిపోతారు.

**ఆగస్టు 7...యం.యస్.స్వామినాథన్ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# చేనేతకు చేయూతనిద్దాం



చేనేత, ప్రసిద్ధి చెందిన ఒక కుటీర పరిశ్రమ. పద్మశాలీ, దేవాంగ, తొగట, తొగటవీర క్షత్రియ, పట్టుశాలి, జాంద్ర, స్వకులసాలి, కైకాల, కుర్ణి, కర్ణ భక్తులు, కరికాల భక్తులు, భవసార క్షత్రియ, నీలి, నీలకంఠ, నెస్సి, కురిమిచెట్టి, కత్రి, సెంగుందంల కుల వృత్తి. ఈ పరిశ్రమకు అనుసంధానంగా మరికొన్ని చేతి పనులు వృత్తులు ఉన్నాయి. పడుగు (వార్పు), పేక (ఫిల్లింగ్ థ్రెడ్)లు ఒకదానితో ఒకటి అనుసంధానించబడే విధానాన్ని నేత అంటారు. నిలువు వరుస దారాలను కలిపి 'పడుగు' అని, అడ్డు వరుస దారాలను కలిపి 'పేక' అని పిలుస్తారు. అందులో చేతితో మగ్గంపై నేతనేసే విధానాన్ని చేనేతగా పిలుస్తారు.

జాతీయ చేనేత దినోత్సవం 1905 సంవత్సరంలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమాన్ని స్మరించుకోవడానికి జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది చేనేత కార్మికులు మరియు చేతివృత్తుల వారికి జీవనోపాధిని అందించే భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత పరిశ్రమ గణనీయమైన పాత్ర పోషించింది, పోషిస్తుంది.

ఈ రోజున, చేనేత ఉత్పత్తుల అందాలను ప్రదర్శించడానికి మరియు వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు మరియు ప్రదర్శనలు నిర్వహిస్తారు. భారతదేశ దేశీయ సంస్కృతిని కాపాడటంలో చేనేత నేత కార్మికులు పోషించే పాత్రను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. అత్యంత గొప్ప పాత్ర పోషించేదిగా చెప్పవచ్చు.

జాతీయ చేనేత దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జరుపుకొంటారు. ఈ దినం శతాబ్దాలుగా భారతదేశ వస్త్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికులకు ప్రత్యేకంగా భావించవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఎందుకంటే ప్రపంచం పెరుగుతున్న పర్యావరణ సంక్షోభాన్ని మరియు స్థిరత్వం గురించి పెరుగుతున్న ఆందోళనలను ఎదుర్కొంటోంది. చేనేత నేయడం పవర్ లూమ్స్ (మరమగ్గాలు) ద్వారా తయారయ్యే వస్త్రాలకు పర్యావరణ అనుకూలమైన మరియు స్థిరమైన ప్రత్యామ్నాయం.

భారతదేశంలోని లక్షలాది చిన్న-స్థాయి చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. పారిశ్రామికీకరణ మరియు సామూహిక ఉత్పత్తి పెరుగుదల అనేక మంది చేనేత కార్మికుల జీవనోపాధికి



ముప్పు తెచ్చిపెట్టింది.

1905లో కలకత్తాలో బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, మరియు బిపిన్ చంద్ర పాల్ వంటి ప్రముఖ నాయకులు ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం జ్ఞాపకార్థం ఆగస్ట్ 7వ తేదీని ఎంచుకున్నారు. ఈ ఉద్యమం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం భారతదేశ పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించిన చేనేత వస్త్రాలతో సహా భారతీయ నిర్మిత వస్తువులను ఉపయోగించాలని సూచించింది. భారతదేశంలో చేనేత నేయడం గురించిన మొట్టమొదటి సూచనలు సుమారు క్రీ.పూ. 1500 నాటివి. శతాబ్దాలుగా, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతూనే ఉంది. చేనేత కార్మికులు కొత్త పద్ధతులు, నమూనాలు మరియు సామగ్రిని సృష్టిస్తూ వారి ప్రత్యేకతను, నైపుణ్యాన్ని అభివృద్ధి చేశారు, చేస్తున్నారు.

**నేతన్నకు ఉపాధి కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేనేత (పవర్ లూమ్) కార్మికుల ఉపాధి కోసం చేపట్టిన ఒక అద్భుతమైన ఆలోచనతో పెను మార్పులు తీసుకువచ్చిన పథకమే 'చీరల తయారీ పథకం'. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల ప్రాంతంలో చేనేత వృత్తిపై ఆధారపడిన వారి సంఖ్య చాలా ఎక్కువ. రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాల్లో ఒక నూతన పథకం ద్వారా వారికి ఉపాధి కల్పించడానికి పెద్ద పీట వేసింది నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

చీరల తయారీ పథకం వారికి ఎంతో ఆసరాగా నిలిచింది. గతంలో సిరిసిల్ల ప్రాంతంలో మరమగ్గాలపై నేస్తున్న గుడ్డలపై లాభాల కోసం నిర్మాణాత్మక వ్యవస్థ, ఉపాధి ప్రాతిపదికగా కార్యక్రమాలు జరిగినవి. ఒకప్పుడు చేయడానికి ఉపాధి లేక సిరిసిల్ల నేతన్నలు ఇతర ప్రాంతాలకు ఏళ్ల తరబడి వలస వెళ్లేవారు. తల్లోచోట, కొడుకోచోట, పండుగ పబ్బాలకు మాత్రమే సిరిసిల్లకు వచ్చేవారు. ఈ వాస్తవ జీవితాలను గమనించిన ప్రభుత్వం చేనేత కార్మికులకు సరైన జీవన విధానం కోసం ఒక భరోసా కల్పించాలని నిర్ణయించి, అందులో భాగంగా చీరల తయారీ పథకాన్ని ఆమల్లోకి తెచ్చింది. అక్కడి కార్మికుల జీవితాల్లో వెలుగులు చూడాలని తలపెట్టిన కార్యక్రమం దిగ్విజయంగా నిలిచింది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం సిరిసిల్ల ప్రాంతంలోని కార్మికులు, యజమానులలో ఆనందమే.

ఇలాంటి ఆలోచనాత్మక కార్యక్రమాల ద్వారా చేనేతకు ఉపాధి కల్పిస్తూ దేశ ప్రగతికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుడికి భరోసా కల్పించినది తెలంగాణ ప్రభుత్వం.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# తండ్రి చైతన్యమే గద్దర్‌కు స్ఫూర్తి



**డాక్టర్ బి .ఆర్. అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలు శేషయ్యని ఎంతగానో ప్రభావితం చేశాయి. అలా ఆయన క్రమంగా అంబేద్కరిస్టుగా మారి ఒకానొక దశలో తాను సంపాదించిన ఆస్తినంతా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారు. ఆయన అంతిమంగా 'ఆత్మగౌరవం గల వ్యక్తి'గా జీవించారు. ఆ రకంగా శేషయ్య తాను కూడా తన పిల్లలను అంబేద్కర్ లాగా గొప్పగా చదివించి ఉన్నత స్థానాలకు అధిరోహింపజేయాలి అని బలంగా నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు పయనించారు.**
**అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలతో తన తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ రావుని ఎంతగానో ఆకర్షింపజేసింది. అంతిమంగా విఠల్ రావు తండ్రి నుండి ఆత్మగౌరవ పోరాట ఆవశ్యకతని గుర్తించి, స్ఫూర్తి పొంది తాను కూడా అణచివేయబడ్డ తన దళిత బహుజన జాతి విముక్తి దిశగా నడుం బిగించారు.**

గద్దర్ పేరుతో ప్రాచుర్యం పొందిన 'గుమ్మడి విఠల్ రావు' అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు 1948, జనవరి 31 నాడు జన్మించారు. కుటుంబ సభ్యులలో అందరికన్నా చివరి సంతానమైన విఠల్ ఆరో యేట నుంచి తల్లి లచ్చుమమ్మతో అమితమైన సాన్నిహిత్యాన్ని కలిగి ఉండేవారు. తల్లి లచ్చుమమ్మ మట్టి వాసనలు గుబాలించే పల్లె పదాలు మరియు జానపద పాటలు చాలా బాగా పాడేవారు.

విఠల్‌రావు తన తల్లి పాడే జానపద పాటల బాణీలను బాగా ఆకళింపు చేసుకున్నారు. తండ్రి గుమ్మడి శేషయ్య తరచుగా విఠల్ రావుకు 'ఆత్మగౌరవంతో జీవించాలి' అని నిర్దేశించేవారు. అంతేకాకుండా ఆయన 'సమతా సమాజాన్ని కాంక్షించి ఆత్మగౌరవ పోరాటాలలో అగ్రగామిగా ఉద్యమించారు'.

గుమ్మడి శేషయ్య కుటుంబానికి జీవనాధారం నిమిత్తం వ్యవసాయ భూమి లేదు. అందువల్ల వ్యవసాయంలేక బతుకు భారమై కష్టాల కడగండ్లలో కొట్టుమిట్టాడారు. ఒక దశలో ఉన్న ఊరిలో ఉండలేని సంక్లిష్ట పరిస్థితులలో శేషయ్య పొట్టకూటి కోసం తన తల్లి (బాలమ్మ)తో పాటు మహారాష్ట్ర ప్రాంతం లోని గోదావరి తీరానికి వెళ్లారు. ఆయన అక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగించారు.

ఆ కాలంతో ఆ ప్రాంతంలో బలంగా సామాజిక చైతన్యం పరిఢవిల్లుతున్న తరుణంలో శేషయ్య ఒక పక్క కూలీ పనులకు వెళ్తూనే మరో పక్క క్రమంగా రాయడం, చదవడం నేర్చుకుని నేర్చుకున్నారు. 'చదువు అనేది ఆయనను మొట్ట మొదటగా సామాజిక విముక్తుడిని గావించింది' అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఆ విధంగా ఆయన నేర్చుకున్న చదువు 'ఆత్మగౌరవ పోరాట జీవితానికి నాంది పలికింది' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

గుమ్మడి శేషయ్య తాను నేర్చుకున్న చదువు ద్వారా క్రమక్రమంగా అనేక సామాజిక సంఘర్షణలు అధిగమించగలిగారు.

ఆయన భవన నిర్మాణ మేస్త్రీగాను పూర్తి పరిణతి చెందారు. ఔరంగబాద్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన మిళింద్ విశ్వవిద్యాలయం భవన నిర్మాణంలో శేషయ్య మెస్త్రీ గాను మరియు కాంట్రాక్టర్ గాను పనిచేశారు. ఆ క్రమంలో ఆయన ప్రత్యక్షంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారిని చూడడమే కాకుండా ఆయనతో మాట్లాడి ఆయన ఆలోచనా విధానానికి ఎంతగానో ప్రభావితులు అయ్యారు. నిజానికి 'దళిత కులంలో జన్మించిన శేషయ్య సహజంగానే అంబేద్కర్ భావజాలం వైపు ఆకర్షింపబడ్డారు' అ ని చెప్పవచ్చు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలు శేషయ్యని ఎంతగానో ప్రభావితం చేశాయి. అలా ఆయన క్రమంగా అంబేద్కరిస్టుగా మారి ఒకానొక దశలో తాను సంపాదించిన ఆస్తినంతా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారు. ఆయన అంతిమంగా 'ఆత్మగౌరవం గల వ్యక్తి'గా జీవించారు. ఆ రకంగా శేషయ్య తాను కూడా తన పిల్లలను అంబేద్కర్‌లాగా గొప్పగా చదివించి ఉన్నత స్థానాలకు అధిరోహింపజేయాలి అని బలంగా నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు పయనించారు.

ఆరు ఏళ్ళు వచ్చే వరకు తల్లే లోకంగా జీవించిన విఠల్ రావుని ఆ కాలంలోనే పాఠశాలలో చేర్పించారు. విఠల్ రావు రెండో తరగతికి వచ్చే నాటికి తండ్రి శేషయ్య మహారాష్ట్ర నుండి స్వస్థలమైన తూప్రాన్ గ్రామానికి వచ్చి అక్కడే జీవనాన్ని సాగించారు.

ఆ క్రమంలోనే విఠల్ రావు క్రమక్రమంగా తండ్రి శేషయ్య ఆలోచనా విధానాలను అంటిపెట్టుకోవడం ప్రారంభించారు. ఆ క్రమం నుండి తండ్రి శేషయ్య పొద్దు గూకాక తన కుమారుడు విఠల్‌రావుని ఒళ్ళో కూర్చోబెట్టుకొని సొంత పాటలు కట్టి పాడేవారు. అలాగే అంబేద్కర్ ఉద్యమానికి సంబంధించిన మరాఠీ పాటలు మరియు ఇతర పాటలు కూడా పాడి వినిపించేవారు. ఆయన అప్పుడప్పుడు తత్వాలు కూడా వినిపించేవారు.

అలాగే ఆయన వేమన శతకం, సుమతి శతకం మరియు నృసింహ శతకాలలోని జ్ఞాన బోధనల పద్యాలను విఠల్‌రావుకి లయబద్ధంగా చదివి వినిపించేవారు.

అదే విధంగా ఆయన ప్రత్యేకంగా కబీర్ గురించి ప్రస్తావించేవారు. ఆ రకంగా శేషయ్య అప్పటినుండి తాను ఎక్కడికి వెళ్లినా కూడా తన కుమారుడు విఠల్ రావుని ప్రత్యేకంగా తన వెంట తప్పకుండా తీసుకొని వెళ్లి అనేక సామాజిక విషయాల పట్ల పరిశీలనాత్మకమైన అవగాహనను కలిగింపజేశారు.

అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలతో తన తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ రావుని ఎంతగానో ఆకర్షింపజేసింది. అంతిమంగా విఠల్‌రావు తండ్రి నుండి ఆత్మగౌరవ పోరాట ఆవశ్యకతని గుర్తించి, స్ఫూర్తి పొంది తాను కూడా అణచివేయబడ్డ తన దళిత బహుజన జాతి విముక్తి దిశగా నడుం బిగించారు. ఆయన ముందుగా సమాజ దార్శనికతని అలవరచుకొని తన దళిత బహుజన జాతి బతుకులను సమున్నతంగా తీర్చి దిద్దడానికి అనునిత్యం కృషి చేశారు. ఆ రకంగా విఠల్‌రావు జీవితం చిన్ననాటి నుండే అంబేద్కరిజం వెలుగులో 'ఆత్మగౌరవం కోసం బతుకే ఒక పోరాటం'గా ప్రజ్వలించే పోరాట స్ఫూర్తిని రగిలింపజేయడంలో తండ్రి శేషయ్య క్రియాశీల పాత్రని నిర్వహించారు.

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# బీసీ రిజర్వేషన్ల ప్రదాత బి.పి.మండల్

బిందేశ్వరి ప్రసాద్ మండల్ బీహార్ లోని బనారస్‌లోని యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని, దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచి పెట్టవలసి వచ్చింది.

మండల్ తన 23 వ యేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు.1945-51 మధ్య కాలంలో మాధేపుర డివిజన్‌లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షంలో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షంలో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి)లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు.

1967లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967లో 69 సీట్లు వచ్చాయి. బీహార్‌లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేరారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వంలో కొన్ని విభేదాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమీషన్ వేశాడు. ఆ కమీషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరా గాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, 'ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు' అని చెప్పే మండల్ తన ప్రభుత్వంలో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.

1967 మార్చి5న సోషిత్‌దళ్ (అణగారిన ప్రజల పార్టీ )ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోకసభ సభ్యునిగా ఉన్నాడు. 1972లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974లో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారా యణ నేతృత్వంలో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్‌సభకి ఎన్నికై 1979 వరకు కొన సాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరా గాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితం లో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పనిచేసాడు.

భారత ప్రభుత్వం 1979 వెనుక బడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. దానికి బీపీ మండల్‌ను ఛైర్మన్‌గా నియ మించారు. ఈ కమిషన్ వెనుకబడిన తరగతుల విద్య ఉద్యోగ స్థితిగతులను గురించి అధ్యయనం చేయనుంది. తర్వాత మండల్ కమీషన్ నివేదిక సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుక బడిన తరగతుల కోసం 27% రిజర్వేషన్లను సిఫా ర్సు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో. ఈ సిఫార్సు 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వి.పి.సింగ్ నేతృత్వం లోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ద్వారా అమలు లోకి వచ్చింది. కాబట్టి ఆగస్టు 7న మండల్ దివాస్ గా జరుపుకుంటున్నాం.

మండల్ కమీషన్ సిఫార్సుల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో 27% రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు.

ఈ రిజర్వేషన్లు సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారికి విద్య మరియు ఉద్యోగ అవకాశాలను మెరుగు పరచడానికి ఉద్దేశించబడింది.

వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అమలు లోకి వచ్చిన తర్వాత, SC మరియు STలతో పాటు OBCలకు రిజర్వేషన్లు 49.5%కి చేరాయి.

మండల్ కమీషన్ సిఫార్సులు మరియు 27% రిజర్వేషన్ల అమలుపై అభ్యంతరాలు మరియు నిరసనలు కూడా ఉన్నాయి. అయితే, మండల్ కమీషన్ సిఫార్సులు మరియు 27% రిజర్వేషన్లు ఆఇల సామాజిక మరియు విద్యాపరమైన అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముందడుగుగా పరిగణించబడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ చేయడం దానికి అనుగుణంగా బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించడం అదేవిధంగా కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్న అన్ని రాజకీయ పార్టీలోని నాయకులకు బీపీ మండల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తద్వారా మాత్రమే బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతాయని విశ్వసిస్తున్నాను.

**- తాయప్ప**

# నైపుణ్యం మెరుగుపర్చుకోవడంతోనే యువతకు ఉపాధి

- సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం
- విజయవాడ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్







**విజయవాడ తూర్పు, ఆగస్టు 06(మనం న్యూస్):** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్ లో సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం.

ప్రతి వంద కి.మీలకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్ లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సీబీజీ ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సీఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్ తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

## బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి




**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని.. సమష్టి కృషితో, పటిష్ట భాగస్వామ్యంతో ఎన్టీఆర్ జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి అన్నారు. బుధవారం కానూరులోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి అధ్యక్షతన ఎన్టీఆర్ జిల్లా కు సంబంధించి సమన్వయ సమావేశం జరిగింది. బాలల సమస్యలు, విద్యాహక్కు చట్టం- 2009, బాలల న్యాయ చట్టం-2015, పోక్సో చట్టం-2012, బాలల హక్కుల చట్టం-2005 తదితరాలపై స్త్రీ శిశు సంక్షేమం, పోలీసు, పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్ విద్య తదితర శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బి.పద్మావతి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్బులు, చిల్డ్రన్స్ కమిటీలు, ఈగల్ క్లబ్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, శక్తి కమిటీలు తదితరాలతో పాటు ఫిర్యాదుల బాక్సు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. బాలబాలికల హక్కుల పరిరక్షణకు, రక్షణ-సంరక్షణకు సమష్టి కృషి అవసరమన్నారు. అనాథ పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న చిన్నారులకు వసతి పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలు నిషేధ, పర్యవేక్షణ కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటుచేసి, బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు కృషిచేయాలన్నారు. ఎక్కడైనా అనాథ పిల్లలు ఉన్నట్లయితే వెంటనే జిల్లాలోని బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలని.. పిల్లలకు స్పాన్సర్షిప్ కింద నెలకు రూ. 4 వేలు అందుతాయని తెలిపారు. బాలబాలికలకు సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, ఆరోగ్యకార్డుల జారీ తదితరాలపైనా సమావేశంలో చర్చించి.. బాలల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి దిశానిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం , గిరిజన సంక్షేమం, జిల్లా బాలల సంరక్షణ విభాగం, వన్ స్టాప్ సెంటర్ తదితర విభాగాల అధికారులతోనూ సమీక్షించి ఆయా శాఖల పరిధిలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐవో బి.ప్రభాకర్, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, చైల్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రవి భార్గవ్, సాంఘిక సంక్షేమ అధికారి బి.రమాదేవి, మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బానీ, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆశారాణి, సీడీపీవోలు, ఎంఈవోలు, డీసీపీయూ సిబ్బంది, వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ అభిమానుల ఆత్మీయ సమావేశం

**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** విజయవాడ బందర్ రోడ్‌లోని రామ్మోహన గ్రంథాలయం పై అంతస్తులో ఉన్న అటల్ బిహారీ వాజ్ పేయి విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ అభిమానుల ఆత్మీయ సమావేశాన్ని గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత 13వ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా మండలి బుద్ధ ప్రసాద్, కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. మొదటిగా వందేమాతరం గీతాలాపనను రామ్మోహన గ్రంథాలయ ఉపకార్యదర్శి తంగిరాల రఘురాం ఆలాపించారు. గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు స్వాగతోపన్యాసాన్ని ప్రసంగించారు. గౌరవ అతిథి మండలి బుద్ధ ప్రసాద్ గ్రంథాలయ అనుభవాన్ని గురించి వారి మాటలలో ప్రసంగించారు. రామ్మోహన గ్రంథాలయ చరిత్ర మరియు ప్రాముఖ్యతను గురించి ప్రపంచ తెలుగు రచయితల సంఘ కార్యదర్శి డాక్టర్ జీ.వి. పూర్ణచంద్ వివరించారు. రామ్మోహన గ్రంథాలయ కార్యక్రమాలు, కార్యచరణ గురించి గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి కేశవరావు మాట్లాడారు. అనంతరం అటల్ బిహారీ వాజ్ పేయి విజ్ఞాన కేంద్రంలో గల చిత్రపటాలను గీసిన కమిటీ సభ్యులు పావులూరు చిదంబరేశ్వర రావును సత్కరించారు. పుస్తక ప్రేమికులు భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రసంగిస్తూ పుర ప్రముఖులు సాహిత్య అభిలాషలు విశేషంగా సదరు రామ్మోహన గ్రంథాలయాన్ని హితోదికంగా ఆదుకొని గ్రంథాలయ అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందరూ అందించాలని కోరారు. ముఖ్య అతిథి సత్కార కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్ర రావు పాల్గొన్నారు.



## హజ్ యాత్రికులు ఎంబార్కేషన్ పాయింట్‌ను వినియోగించుకోవాలి

- మేనిఫెస్టోలో చెప్పినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం
- చైర్మన్ ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఎస్‌కె హసన్ బాషా



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను తిరిగి పునరుద్దరించడంలో చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని హజ్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ మన రాష్ట్రానికి సెంట్రల్ హజ్ కమిటీ 2550 మందికి హజ్ యాత్రకు అవకాశం కల్పించిందన్నారు. గతేడాది విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు దరఖాస్తు చేసుకున్న 72 మందికి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందచేయడం హర్షనీయమన్నారు. ఈ ఏడాది పవిత్ర మక్కా యాత్రకు పయనమయ్యే యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను ఎంపిక చేసుకోవాలని కోరారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఎంపిక చేసుకున్న యాత్రికులకు ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందచేస్తుందని వివరించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను మనం నిలబెట్టుకోవాలంటే పెద్ద సంఖ్యలో యాత్రికులు విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు బయలుదేరాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పవిత్ర మక్కా యాత్రకు వెళ్లిన వారు ఎదుర్కొన్న ఇబ్బందులను కూటమి ప్రభుత్వం సరిదిద్ది వారికి మంచి సౌకర్యాలను కల్పించనుందని హామి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. పవిత్ర మక్కా యాత్ర కు సిద్ధమైన యాత్రికులు హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల నుండి ఎక్కువగా బయలుదేరుతున్నారని, కాని ఈఏడాది విజయవాడ నుంచి బయలుదేరే విధంగా ఇప్పటికే హజ్ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశామని, అందరికి అవగాహన కల్పించామన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తుకు మరొక్క రోజు మాత్రమే గడువు ఉందన్నారు. ఇప్పటికే 1900 మందికి పైగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ధరఖాస్తు చేసుకున్నారన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని సెంట్రల్ హజ్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. హజ్ కమిటీ డైరక్టర్ షెక్. అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చూపించిందన్నారు. మ్యానిపెస్టోలో చెప్పిన విధంగా పవిత్ర మక్కా యాత్ర చేసిన హజ్ యాత్రికులకు రూ. లక్ష అందించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో హబిబుల్లా, మహమ్మద్ సాజి తదితరులు పాల్గొన్నారు.

## నానో ఎరువులతో పైరుకు ఆదరవు

### వినియోగంపై అన్నదాతలకు అవగాహన పెంచండి

### ఏపీ మార్క్ఫెడ్ ఇగ్నైట్ సెల్‌ను సందర్శించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ






**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకుండా అన్నదాతలకు అవగాహన కల్పించాలని, పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచడంతో పాటు డబ్బును, సమయాన్ని ఆదా చేసే నానో ఎరువులుపై అన్నదాతలకు సమన్వయ శాఖల అధికారులు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఏపీ మార్క్ఫెడ్ ఇగ్నైట్సెల్ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఖరీఫ్ సీజన్ (2025-26)కు సంబంధించిన వివిధ పంటల కనీస మద్దతు ధరలు, ఏపీ మార్క్ఫెడ్ రైతులకు అందిస్తున్న సేవలు, సీఎం ఎయిడ్, సీఎం యాప్, మార్క్ రే ఈ-ఆక్షన్ ప్లాట్ఫామ్ తదితర వివరాలతో రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. అదేవిధంగా నానో యూరియా, నానో డీఏపీ, నానో జింక్, నానో కాపర్ తదితర ఎరువుల బాటిళ్లను పరిశీలించారు. నానో ఎరువులను తేలిగ్గా స్ప్రే చేయగలిగే కిసాన్ డ్రోన్ పనితీరును పరిశీలించారు. నానో ఎరువుల వల్ల దాదాపు 50 శాతం మేర ఎరువుల ఆదా అవుతుందని.. పంట రకాలు, వివిధ దశల్లో వినియోగించాల్సిన మోతాదు, స్ప్రేయర్ల వినియోగం తదితరాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్లో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో స్థూల విలువ జోడింపు (జీవీఏ)ను పెంచేందుకు, రైతుల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకునేలా చేయడంలో మార్క్ఫెడ్ అధికారులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఉత్పాదితాలు అందించడంతో పాటు మార్కెటింగ్లోనూ విశేష సేవలు అందిస్తున్న మార్క్ఫెడ్ అధికారులు అన్నదాతల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ కె.నాగమల్లిక, మార్క్ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన అవశ్యం

- ఈగల్ క్లబ్స్ క్రియాశీలంగా వ్యవహరించేలా చూడాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ







**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారం దిశగా పయనిస్తూ జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దే క్రమంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై బుధవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని.. షెడ్యూల్ ప్రకారం నిర్వహణకు కృషిచేయాలన్నారు. ఇందులో ఈగల్ క్లబ్స్తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను కీలకపాత్ర పోషించేలా చూడాలన్నారు. స్వల్ప నిడివితో ఆడియో, వీడియో ప్రదర్శనలు, పీపీటీ ప్రజంటేషన్, సందేహాల నివృత్తి, ఇంటరాక్షన్ వంటివాటితో అరగంట పాటు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ అంటే ఏమిటి? డ్రగ్స్ ఏ రూపాల్లో చొచ్చుకొస్తున్నాయి? వీటిని ఉపయోగిస్తున్న వారిని గుర్తించడం ఎలా? సున్నితంగా సమస్యను ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హాట్స్పాట్లను గుర్తించి.. ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించాలని, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

### నషా ముక్త్ భారత్ ఐదేళ్ల ప్రయాణం

మాదకద్రవ్యాల వినియోగం అనేది తీవ్రమైన శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతోందని, సమాజాన్ని కలవరపాటుకు గురిచేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2020, ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించడం జరిగిందని, కార్యక్రమం ప్రారంభమై ఐదేళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు విస్తృత స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీలు, వాకథాన్లు, వెబినార్లు, సెమినార్లు, పోటీలు వంటివి నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 13న పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇలా ప్రతిచోటా జిల్లా, రాష్ట్రం, దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి శక్తి మేరకు కృషిచేస్తాననే ప్రతిజ్ఞ చేయించాలని, కార్యక్రమాల వివరాలను ఎన్ఎంబీఏ మొబైల్ అప్లికేషన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులతో కలిసి 'సే నోటు డ్రగ్స్, డ్రగ్స్ వద్దు, స్కిల్స్ ముద్దు' ఈగల్ టోల్ఫ్రీ నం.1972, ఈగల్ క్లబ్స్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ఏసీపీలు కె.వెంకటేశ్వరరావు, కె.లతా కుమారి, ఈగల్ ఎస్సై ఎం.వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయ అధికారులపై చర్యలకు దిగిన ఈఓ

**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 06(మనం న్యూస్):** దుర్గమ్మ ఆలయంలో అధికారులపైన ఈఓ శీనా నాయక్ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. మంగళవారం జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కారు ను ఓం టర్నింగ్ వద్ద ఎజైల్ సెక్యూరిటీ సిబ్బంది ఆపిన ఘటనలో ఈఓ శీనా నాయక్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ప్రోటో కాల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వారికి ఎమ్మెల్యే ముందుగా సమాచారం అందించినప్పటికీ ఆ సమాచారాన్ని చేరవేయడంలో ప్రోటో కాల్ ఉద్యోగులు విఫలమైనట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈఓ శీనా నాయక్ దుర్గ గుడి ప్రోటో కాల్ విభాగంలో పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతానికి మార్చినట్లుగా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈఓ శీనా నాయక్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూరెళ్ల శ్రీనివాస్ స్థానంలో సూపరిండెంట్ వి.సూర్యనారాయణ మూర్తిని, జూనియర్ అసిస్టెంట్ డీవీఎన్ రాజు స్థానంలో ఈఓ సీసీ, రికార్డు అసిస్టెంట్ ఎం.జయప్రకాష్‌ను, రికార్డు అసిస్టెంట్ పి.శ్రీనివాస్ స్థానంలో ఎన్నావమ్మార్ జి.పునీత్‌ను, అటెండర్ జి.కృష్ణమ్మ స్థానంలో ఎన్నావమ్మార్ ఎంసీఎస్ వర ప్రసాద్‌లను తాత్కాలికంగా నియమిస్తూ ఈఓ శీనా నాయక్ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

## సరోగసి పేరుతో 80 మంది పిల్లల విక్రయం

**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 06(మనం న్యూస్):** సృష్టి టెస్ట్ ట్యూబ్ ఆసుపత్రి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 80 మంది చిన్న పిల్లలను అమ్ముకున్నట్లు డాక్టర్ నమ్రత అంగీకరించినట్లు తెలుస్తోంది. వేర్వేరు ప్రాంతాల నుంచి పిల్లలను సేకరించామని ఆమె విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అందరికీ డబ్బులు ఇచ్చి కొనుగోలు చేశామని నమ్రత పోలీసులకు తెలిపారు. ఏజెంట్ల వివరాలు లేవని డాక్టర్ నమ్రత చెప్పినట్లు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 80 మంది పిల్లల తల్లిదండ్రుల వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. మళ్లీ నమ్రతను కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం

- కలెక్టర్ ను అభినందించిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీ, ఎండి వీపీ గౌతమ్.

**కామారెడ్డి, ఆగస్టు 06 (మనం జిల్లా ప్రతినిధి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిలో రాష్ట్రస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను, జిల్లా అధికార యంత్రంగాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీ, ఎండి వీపీ గౌతమ్ అభినందించారు.

బుధవారం హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వీపీ గౌతం బిక్నూర్ మండలం బస్సాపూర్ గ్రామంను హౌసింగ్ అధికారులతో మరియు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తో కలిసి జిల్లాలోని బిక్నూరు మండలకేంద్రంలో ఫిల్టర్ రూఫ్ టెక్నాలజీ ద్వారా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను మరియు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను,

దోమకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సందర్భంగా ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపు అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉచితంగా ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని, దశలవారీగా నిర్మాణం జరిగిన కొద్దీ బిల్లులు వెంటనే లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., కామారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉన్నదని, ఇందిరమ్మ లబ్ధిదారులచే ఇండ్ల నిర్మాణం ప్రారంభించడం, ఇండ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం మరియు ఇతర మెటీరియల్, బిల్లుల చెల్లింపులలో ఎక్కడ సమస్య రాకుండా క్లస్టర్ వారిగా అధికారులను నియమించి అధికారులతో సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలలో పర్యటిస్తూ



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కు మరియు ఇండ్ల నిర్మాణంలో పాలుపంచుకుంటున్న అన్ని స్థాయిల అధికారులకు అభినందనలు తెలిపారు. బిక్కనూరు మండల కేంద్రంలో ఫిల్టర్ రూఫ్ పద్ధతిలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ హౌసును చూడడం జరిగిందని, మామూలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కంటే ఈ పద్ధతిలో నిర్మించుకోవడం వలన నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా ఇల్లు వేసవి కాలంలో చల్లగా మరియు శీతాకాలంలో వెచ్చగా ఉంటుందని లబ్ధిదారులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులను, మేస్త్రి లను తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో చూపించాలన్నారు. ఇసుక అనేది ప్రభుత్వ ఆస్తి అని ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరు ఇసుక సరఫరా చేసిన అది చట్ట విరుద్ధం అని అలాంటి వారిపై నిగా పెట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే సమయంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇలాంటి సమస్య ఇసుక రాకుండా హౌసింగ్ అధికారులు తాసిల్దార్ మరియు ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని ఉచితంగా ఇసుక టోకెన్లు అందించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే ఇసుక రవాణా కొరకు ట్రాక్టర్లకు, లేబర్స్ లబ్ధిదారులు చార్జీలు చెల్లించేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. తద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎక్కువ వారం లబ్ధిదారుల పైన పడకుండా ఉంటుందని అన్నారు. అదేవిధంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ కంకర, రాడ్లు, సిమెంటు, ఇటుకలు సరఫరా అయ్యేలా చూడాలని, మేస్త్రీలు అధిక మొత్తంలో నిర్మాణ చార్జీలు తీసుకోకుండా చూడాలని అన్నారు. హౌసింగ్ ఇంజనీర్లు ప్రతిరోజు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలను సందర్శించి లబ్ధిదారులకు సూచనలు, సలహాలు ఇస్తూ నాణ్యతగా ఇల్లు నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. వారం వారం లబ్ధిదారులకు బిల్లును చెల్లించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మట్టి గట్టిగా ఉంటుందని అన్ని ప్రాంతాలలో నిర్మాణానికి పిల్లర్స్ అవసరం లేవని అన్నారు. ప్లింత్ భీమ్ మాత్రమే వేసుకోవాలి తప్ప కాలమ్స్ మరియు పిల్లర్స్ వేసుకోవాలని లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా అనర్హులు ఎంపిక అయితే వారు ఏ స్థాయిలో ఇల్లు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం ఆపివేసి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా12090 లక్ష్యంతో 11883 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా వాటిలో 5721 ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించడం జరిగింది. ఇప్పటివరకు 2182 ఇండ్లు బేస్మెంట్ లెవల్ వరకు, 66 ఇండ్లు రూఫ్ లెవల్ వరకు నిర్మాణం పూర్తికాగా 1 ఇల్లు నిర్మాణం పూర్తయింది. 2111 ఇండ్లకు నిర్మాణ దశను బట్టి బిల్లులు చెల్లించడం జరిగింది. 431 మంది నిరుపేద లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం ప్రారంభించుకునేందుకు ఐకెపి మహిళా సంఘాల ద్వారా లింకేజీ రుణం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ విక్టర్, లోకల్ బాడీస్ చందర్ నాయక్, పిడి హౌసింగ్ విజయ్ పాల్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో వీణ, హౌసింగ్ డిఇ సుభాష్, ఏఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి...



**కామారెడ్డి, ఆగస్టు 06 ( మనం ప్రతినిధి ) :** తెలంగాణ సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప త్యాగశీలి ఆచార్య జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., అన్ని రంగాలలో వెనుకబడిన తెలంగాణ సమాజాన్ని చైతన్య పరిచేందుకు ఆచార్య జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యావంతుడైన ఆయన తెలంగాణ సమాజానికి జరుగుతున్న అన్యాయాలను చూసి చెలించి అన్ని దశల తెలంగాణ ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొని తన రచనలు, ప్రసంగాల ద్వారా తెలంగాణ సమాజాన్ని తట్టి లేపి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా వేలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మార్గదర్శక నిలిచారని ఆయన అడుగుజాడల్లో తెలంగాణ సమాజ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, కలెక్టరేట్ ఏవో, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టీఎన్జీవో, టీజీవో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం డిమాండ్

**నిజామాబాద్, ఆగస్టు 06 (మనం బ్యూరో) :** రైతు ఆత్మహత్య యత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అటవిశాఖ ఉన్నతాధికారులకు బంజారా సేవా సంఘం బుధవారం ఫిర్యాదు చేశారు. బైరాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో పోడు భూమిలో వేసిన పంటపైన మందు పిచికారీ చేసి ప్రకాష్ అనే గిరిజనుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోవానికి కారకులైన అధికారులపై చర్య తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఎఐబిఎస్ఎస్) ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మోపాల్ మండల మాజీ జడ్పీటీసీ నరేష్ నాయక్ సారథ్యంలో మోపాల్ మండల గిరిజనులు ప్రకాష్ ఆత్మహత్య యత్నానికి కారకులైన వారిపై చర్య తీసుకోవాలని దక్షిణ మండలం అటవీ శాఖ అధికారి రాధిక కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నరేష్ మాట్లాడుతూ., మంగళవారం మోపాల్ వండలంలోని భైరపూర్ గ్రామనికి చెందిన ప్రకాష్ మోజిరామ్ నాయక్ తండా వద్ద తరాతరలుగా పోడు భూమలో సాగు చెస్తున్నారని గత ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇవ్వటంతో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు గిరిజన హక్కుల చట్టాన్ని ఉల్లంగిస్తూ అటవీ అధికారుల బృందం పంటలను నాశనం చేయడం సమంజసం కాదన్నారు.మొక్కజొన్న పంటపై గడ్డి మందు (హీర్బైడ్) పిచికారీ చెసి ప్రకాష్ కుటందానికి తీవ్ర నష్టం కలిగించారన్నారు. దీనిని జీర్ణించుకోలేక అటివిశాఖ అధికారుల తీరును నిరసిస్తూ అక్కడే ఉన్న గడ్డి మందును సేవించి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించడం తీవ్రంగా కలచి వేసిందన్నారు ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామావత్ మోహన్ నాయక్, ప్రధానకార్యదర్శి కేతావత్ పీర్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేల్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల సందర్శన
- భూభారతి దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో సమీక్ష
- పీ.హెచ్.సీ, జెడ్పీ హైస్కూల్, ఎరువుల గోడౌన్ తనిఖీ



**నిజామాబాద్, ఆగస్టు 06 (మనం న్యూస్) :** వేల్పూర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహకార సంఘం ఎరువుల గోడౌన్ లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. సాంకేతిక ఇబ్బంది కారణంగా కొంతమంది విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు కావడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న తెలుపగా, కలెక్టర్ అప్పటికప్పుడు తన సమక్షంలోనే ఎఫ్.ఆర్.ఎస్ ఇఁుద్ధతిన విద్యార్థుల హాజరును ఆన్లైన్ లో నమోదు చేయించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు విధానం సంపూర్ణంగా అమలు అయ్యేలా చూడాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకువెళ్లాలని సూచించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్న తీరును గమనించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, అలాంటి వారి పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. వంట గది, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఉడకబెట్టిన కోడి గుడ్లను అందించాలని ఆదేశించారు. విద్యార్థులు అందరూ తరగతులకు ప్రతిరోజూ హాజరయ్యేలా చూడాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్ వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. కాన్పులు చేసేందుకు వీలుగా అన్ని వసతులు అందుబాటులో ఉన్నందున గర్భిణీలు స్థానికంగానే సుఖ ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీణకు సూచించారు. జాతీయ నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ, వ్యాక్సినేషన్, గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి చోటుచేసుకోకుండా గట్టి నిఘా ఉంచాలని, ఏదైనా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, పీ.హెచ్.సీలలో బేబీ వార్మర్లు పని చేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్, టీ.జీ.ఎం.ఎస్.ఐ.డీ.సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫోన్ చేసి, వెంటనే అన్ని పీ.హెచ్.సిలలో బేబీ వార్మర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్తవి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలతో కూడిన బోర్డును రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, పూర్తి స్థాయిలో అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఎక్కడ కూడా ఎరువుల పంపిణీ సమయంలో టోకెన్ పద్ధతి, క్యూ విధానాలను అమలు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడి నుండి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ బాలకిషన్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఆన్లైన్ వివరాలను పరిశీలించారు. ప్రజా పాలన సేవా కేంద్రం కొనసాగుతున్నట్లు ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతి కార్యదర్శి వినోద్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు అందరూ ఇళ్ళను నిర్మించుకునేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీవో



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 06 (మనం న్యూస్):** మండలంలోని గోలిలింగాల గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పార్థసింహారెడ్డి మాట్లాడుతూ., ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. గ్రామంలో వర్షాకాలంలో ఏలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు సురేందర్ గౌడ్, మోహన్ రెడ్డి, అశోక్ గౌడ్, కుమార్, మహేష్, రామస్వామి, సాయిలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

**బాన్సువాడ, ఆగస్టు 06 ( మనం న్యూస్ ) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్మీడియట్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఉదయం ప్రార్థన సమయానికి విచ్చేసి విద్యార్థినులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులతో ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. తదనంతరం కళాశాల అధ్యాపకులతో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి అధ్యాపకుల టీచింగ్ డైరీస్, హాజరు పట్టికలు, సబ్జెక్టు వారిగా ఉత్తీర్ణత శాతం, యూనిట్ టెస్ట్ వివరాలు, కళాశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలు పరిశీలించారు.అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించడానికి అధ్యాపకులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అన్ని చాలా చక్కగా బాగున్నాయని ప్రిన్సిపాల్ అసద్ ఫారూఖ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారూఖ్, జిల్లా ఏ జి ఎం సి శివకుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## ఎయిర్‌పోర్టులకు ఉగ్రవాద ముప్పు

- ఇంటెలిజెన్స్ హెచ్చరికలు

**ఢిల్లీ, ఆగస్టు 6 :** దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర, సంఘ వ్యతిరేక శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యాయి. దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 మధ్య విమానాశ్రయాలపై దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర పౌర విమానయాన



భద్రతా బ్యూరో అన్ని ఎయిర్‌పోర్టులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. రన్‌వేలు, హెలీప్యాడ్స్, ఫ్లైయింగ్ స్కూల్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లలో భద్రత పెంచాలని సూచించింది. దీంతో విమానాశ్రయాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా, పెరిమీటర్ జోన్, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. స్థానిక పోలీసుల సహకారంతో ఎయిర్‌పోర్టులకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో పంపే మెయిల్ పార్సిళ్లను క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. సిబ్బంది, కాంట్రాక్టర్లు, విజిటర్స్‌ను కూడా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. విమానాశ్రయాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు గానీ, లగేజీ గానీ కన్పిస్తే తక్షణమే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ప్రయాణికులకు సూచించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌ను యాక్టివేట్ చేశారు. అవసరమైతే మాక్ డ్రిల్స్ చేపట్టాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించింది.

# ఆ 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి

- ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన సుప్రీం

**ఢిల్లీ, ఆగస్టు 6 :** బీహార్లో ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదా విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఇందుకోసం ఈనెల 9 వరకు గడువు ఇచ్చింది.

బీహార్‌లో ఈసీ ఓటర్ల ప్రత్యేక సవరణను నిర్వహించడాన్ని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్జీవో గతంలో సుప్రీంలో సవాల్ చేసింది. ఈసీ ముసాయిదా విడుదల నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలు వెల్లడించాలంటూ మరో దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం విచారణ జరగ్గా.. ఇప్పటికే రాజకీయ



పార్టీలకు వివరాలను సమర్పించిన నేపథ్యంలో ఎన్జీవోకు కూడా వాటిని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీలకు జాబితా ఇచ్చినప్పటికీ.. తొలగింపునకు గల కారణాలు తెలపలేదని ఎన్జీవో తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ప్రస్తుతం జాబితా వివరాలను మాత్రమే అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వెల్లడిస్తుందని స్పష్టంచేసింది. ఈసందర్భంగా పోల్ ప్యానెల్ సిబ్బంది ఓటరు జాబితా నుంచి కొంతమంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేశారని ఎన్జీవో తరఫు న్యాయవాది ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 12న విచారిస్తామని, అక్కడ మీ వాదనలను వినిపించవచ్చని న్యాయస్థానం పేర్కొంది.

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తవడంతో దానికి సంబంధించిన ముసాయిదాను ఇటీవల విడుదల చేసింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఈసీ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి.

## బ్రెజిల్లో ట్రంప్ మిత్రునికి గృహనిర్బంధం

### బోల్సొనారోకు శిక్ష ఖరారుచేసిన ఆ దేశ సుప్రీంకోర్టు

**సావోపాలో, ఆగస్టు 6 :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో (70)కు దేశ సుప్రీంకోర్టు గృహనిర్బంధ శిక్ష విధించింది. 2022 అధ్యక్ష ఎన్నికలో ఓడిపోయి కూడా తన అనుయాయులతో తిరుగుబాటుకు ప్రయత్నించి, ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు ఆయనకు ఈ శిక్ష పడింది. 2023 జనవరి 8న బోల్సొనారో అనుయాయులు బ్రెజిల్ ప్రభుత్వ భవనాలపై దాడికి ప్రయత్నించారు. బోల్సొనారోకు క్షమాభిక్ష ఇవ్వాలని కోరుతూ సావోపాలో, రియో డి జనీరో నగరాల్లో ఆదివారం వేలమంది అభిమానులు భారీ ప్రదర్శన నిర్వహించారు. వారిలో ఆయన ఓటమి అనంతరం ప్రభుత్వ భవనాలపై దాడిచేసినవారు కూడా చాలామంది ఉన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రే డి మొరేస్ సోమవారం బోల్సొనారోకు గృహ నిర్బంధ శిక్ష విధించగానే అమెరికా విదేశాంగ శాఖ ఆ నిర్ణయాన్ని ఖండించింది. అంతకుముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మిత్రుడు, అతిమితవాద మాజీ అధ్యక్షుడు బోల్సొనారోను బ్రెజిల్ వామపక్ష ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. ఆయనపై కోర్టు విచారణ జరుపుతున్నందుకు బ్రెజిల్ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించారు. 2022లో బోల్సొనారో ఓడిపోయినప్పుడు నాటి ఎన్నికల్లో విజేత, ప్రస్తుత దేశాధ్యక్షుడు డ సిల్వా, సుప్రీం కోర్టు న్యాయమూర్తి డి మొరేస్‌లను హతమార్చాలని చూశారని ప్రాసిక్యూషన్ ఆరోపణ.

## ట్రంప్ సుంకాల హెచ్చరికల వేళ

### రష్యా పర్యటనకు అజిత్ డోభాల్



ఢిల్లీ, ఆగస్టు 6: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై సుంకాల హెచ్చరికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రతరం చేశారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ రష్యా పర్యటనకు వెళ్లారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. డోభాల్ పర్యటన ముందుగానే ఖరారైందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే, భారత్- రష్యా సంబంధాలపై ట్రంప్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ పర్యటన చర్చనీయాంశంగా మారింది. మాస్కోతో రక్షణ, ఇంధన సంబంధాల బలోపేతమే ఈ పర్యటన ముఖ్య లక్ష్యంగా తెలిపాయి. రష్యా చమురు సరఫరాలు, పరిశ్రమల సహకారం వంటి వాటితో పాటు మరిన్ని ఎస్-400 క్షిపణి వ్యవస్థలు, రష్యాకు చెందిన ఎస్‌క్యూ-57 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలక అంశాలపై మాస్కో అధికారులతో డోభాల్ చర్చలు జరిపే అవకాశం ఉందని వెల్లడించాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా ఈ నెలాఖరులో రష్యాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య రక్షణ, ఇంధన, వాణిజ్య చర్చలే లక్ష్యంగా ఆయన పర్యటన ఉండనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశం కానున్నారు.

## తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్



- కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 06 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్ తో కలిసి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని , ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి మరియు జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనతో పేదల కల సాకారం

- పదేళ్ల తర్వాత ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు
- ప్రతి అర్హునికి సంక్షేమ ఫలాలు అందచేస్తాం
- రేషన్ కార్డుల పంపిణీ సభలో ఎంఎల్ఏ తెల్లం



చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్): దశాబ్దకాలం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన పేదలకు కాంగ్రెస్ పాలనలో అవి మంజూరుతో కావడంతో వారి కల సాకారమవుతోందని భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం చర్లలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరూ రేషన్ కార్డులు, డబల్ బెడ్ రూం ఇల్లు కావాలని అడిగారని వారి కోరిక ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వ హాయంలో తీరడంతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో అరకొరగా ఇల్లులు మంజూరు చేసి పేదలను ప్రలోభాలకు గురిచేసారని, ఉన్న రేషన్ కార్డులను తొలగించి ఇబ్బందులపాలు చేసారని మండిపడ్డారు. ఇందిరమ్మ యాప్ లోపాల కారణంగా కొన్ని గ్రామ పంచాయతీలలో ఇల్ల నిర్మాణం ప్రారంభం కాలేదని, ఈ పంచాయతీలలో ఆఫ్ లైన్ పద్దతిలో ఇల్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్కు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తోందని తెలిపారు. రేషన్ కార్డుల వల్ల ఎంతో ఉపయోగం ఉందని, దాని ద్వారా ఉచితంగా సన్న బియ్యం పొందడమే కాకుండా మల్టీ కార్డుగా ఉపయోగించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు వంటివి నిరంతర ప్రక్రియ అన్నారు. ఎవరూ తమకు సంక్షేమ పథకాలు అందలేదని ఆందోళన చెందవద్దని, అర్హులయిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే మూడు నెలల కాలానికి రేషన్ బియ్యం ఒకే మారు అందచేసామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను ప్రతి ఒక్కటీ అమలు చేస్తోందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్ ప్రయాణం, ఆర్టీసి బస్ సర్వీసుల నిర్వహణ, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు యూనిట్ల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో నూటికి నూరు శాతం 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్ అందుతోందని తెలిపారు. చర్ల మండలంలో ఇప్పటికే 12,857 మందికి రేషన్ కార్డులు ఉండగా కొత్తగా మరో 734 మందికి మంజూరు చేసామని తెలిపారు. ఒక్క ఈ మండలంలోనే 42,360 మందికి రేషన్ బియ్యం అందుతోందని వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చర్ల ప్రాదమిక సహకార సంఘం అధ్యక్షులు పరుచూరి రవికుమార్, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఎంపివో వలీహజ్రత్, సివిల్ సప్లయ్ డీటి గుండి రాజులు, టిపిసిసి ప్రదాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్టు



దమ్మపేట, ఆగస్టు 6(మనం న్యూస్): పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలను చెల్లించాలని ,సరైన సదుపాయాలు కోసం బుధవారం హైదరాబాదులో జరగాల్సిన సెక్రటేరి యట్ ముట్టడికి బయల్దేరిన కార్మికులను దమ్మపేట పోలీసు అధికారులు అడ్డుకున్నారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ కొన్ని నెలలు నుండి జీతా లను నిలిపివేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుం దని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరీ నెల నుండి బిల్లులు రాక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న కార్మికులకు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత హామీలను నెరవేర్చలేదని ప్రభుత్వం వారిపై చిన్న చూపు చూస్తుందని మండిపడ్డారు. ఓట్లు వేయకముందు ఒక మాట, వేసిన తర్వాత ఇంకొక మాట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తగదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని శాంతి యుతంగా నిరసనకు బయలుదేరిన కార్మికులను అడ్డుకోవడం బాధాకరమన్నారు. తక్షణం ప్రభు త్వం పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనా లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో సింహాద్రి సత్యవతి, షేక్ జాన్ బీ ఉన్నారు.

## మంగపేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 06 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మంగపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ తో కలిసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర సేవల గురించి అంగన్వాడీ టీచర్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్నటువంటి గుడ్లను మరియు ఇతర ఆహార పదార్థం నిల్వలను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను సి హెచ్ ఆర్ క్రింద పిల్లలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు? గర్భిణి స్త్రీలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు? గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడం వలన కోతులు మరియు పాముల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని కలెక్టర్ దృష్టికి అంగన్వాడీ సిబ్బంది తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మట్టి ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలో విద్యార్థుల హాజరు శాతం పరిశీలన మంగపేట ప్రాథమిక పాఠశాలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థుల పుస్తక పఠనం, చేతిరాతను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను కలెక్టర్ మెనూ ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదిలలో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యంపై పలు ప్రశ్నలు వేసి బోర్డు పై రాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని మరియు వారి యొక్క చేతిరాతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు మరియు పెన్నులు బహుకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు.రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు కింద కూర్చొని ఉండటాన్ని గమనించి పాఠశాలకు త్వరలో అవసరమైన బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల హాజరు, ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఔషధ నిల్వలు రిజిస్టర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని,ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ గన్యా, ప్రధానోపాధ్యాయురాలు కోటమ్మ, అంగన్వాడి టీచర్ సుజాత మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## బీజపూర్‌లో ఎన్‌కౌంటర్ మావోయిస్టు మృతి

చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్) : ఛత్తీసఘడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా దండకారణ్యపు అడవులు మరీమారు తుపాకుల మోతతో దద్దరిల్లాయి. గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మద్య బుధవారం జరిగిన ఎదురుకాల్పులలో ఒక పురుష మావోయిస్టు మృతి చెందాడు. గంగులూరు అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డిఆర్జి, ఎస్టిఎఫ్, సిఆర్పిఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడటంతో ఇరు వర్గాల నడుమ హోరాహోరీగా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఎన్ కౌంటర్ లో ఒక మావోయిస్టు మృత దేహంతో పాటు పెద్ద ఎత్తున ఆయుదాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నారు.

## వాగులను తోడేస్తున్న ఇసుక బకాసురులు

- పేరుకే ఇందిరమ్మ ఇంటికి - అయ్యేది మాత్రం దొంగలపాలు
- లబ్ధిదారులను సైతం నిండా ముంచుతున్న మధ్యవర్తులు
- ఒకే కూపన్తో యథేచ్ఛగా రెండు రోజుల పాటు తోలకాలు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్ట రాజ్యాంగ ఇసుక తోలకాలు






ఆళ్లపల్లి, ఆగస్టు 6 (మనం న్యూస్): ఇసుక బకాసురులు యథేశ్ఛగా వాగులను తోడేస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇసుక రవాణా చేస్తున్నామని చెప్తూ మండలం నుండి ఇసుకను తరలించి అధిక ధరలకు అమ్ముకొని లబ్ధి పొందుతున్నారు. ఆయా మండలాలలో వాగులు, వంకలలో ఇసుక ఎక్కువ మోతాదులో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక సరిపడా లేదు అని చెబుతూ ఆళ్లపల్లి మండలానికి వచ్చి ఇక్కడి నుండి ఇసుక ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అసలైన లబ్ధిదారులు వారి ఇంటి నిర్మాణానికి ఇసుక ఎలా తీసుకువెళ్లాలో తెలియని వారి అమాయకత్వాన్ని మధ్యవర్తులు ఆసరాగా చేసుకుని నాలుగు వేల లోపు వచ్చే ట్రాక్టర్ ఇసుకను ఆరు నుండి ఏడు వేలకు విక్రయిస్తూన్నారు. లబ్ధి పొందవలసిన లబ్ధిదారులేమో నష్టపోతుంటే సంబంధం లేకుండా వచ్చి మధ్యలో చేరిన మధ్యవర్తులు లక్షలలో సంపాదించుకుంటున్నారు. ఒక్క కూపన్‌పై ఒకే ట్రాక్టర్ ఒకటే రోజు వెళ్లాల్సి ఉండగా అదే కూపన్ పట్టుకొని మరొక రోజు వచ్చి ఇసుక లోడ్ చేసుకొని వెళుతున్నారు. పర్యవేక్షించవలసిన రెవెన్యూ శాఖ అధికారులు అటువైపు తిరిగి చూడకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు ట్రాక్టర్లకు సంబంధించి కూపన్లపై మంగళవారం డేట్ ఉండగా ఆ ట్రాక్టర్లు బుధవారం వెళ్తున్నాయని కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రెవిన్యూ అధికారులు అది పరిశీలించి ఆ ట్రాక్టర్ డ్రైవర్లు చెప్పింది విని వెనకకి తిరిగి వెళ్లారు. ఆ కూపన్ పై మంగళవారం వెళ్లవలసిన ట్రాక్టర్లు బుధవారం ఎందుకు వెళ్తున్నాయని రెవెన్యూ అధికారులు పలువురు ప్రశ్నించగా ఆ కూపన్ ను వదిలేసి కొత్త కూపన్ తీసుకొని వెళ్లాల్సిందిగా డ్రైవర్లకు సూచించి తిరిగి వెళ్లడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొదటగా ఇల్లందు నుండి ఇసుక రవాణా చేసుకుంటామని పర్మిషన్ల కోసం వచ్చి ఒకవైపు ఇసుక రవాణా జరుగుతుంటే అది చాలదన్నట్లుగా టేకులపల్లి మండలం నుండి కూడా ఇటీవలే పరిమిషన్లు తీసుకొని ఇసుక తరలిస్తుండడంతో వాగు లో ఇసుక పూర్తిగా కరిగిపోతోందని ఇదేవిధంగా ఇంకా కొన్నాళ్లు సాగితే పూర్తిగా ఇసుక అయిపోయి నీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దొంగ కూపన్లతో ఇసుక రవాణా చేసే మధ్యవర్తులు, దళారులపై ప్రత్యేక నిగా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నారు.

### తహశీల్దార్ వివరణ :

ఇసుక రవాణాలో ఎటువంటి అక్రమాలు జరగడంలేదని మంగళవారం వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లలో ఇద్దరికి జ్వరం జ్వరం రావడంతో వారు ఇంటికి తిరిగి వెళ్ళడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. డ్రైవర్లకు జ్వరం రావడం వల్ల నిలిచిపోయిన ట్రాక్టర్లకు రాయపాడు కార్యదర్శి బుధవారం ఉదయం ఆ కూపన్ పై డేటు మార్చి పంపించారని తెలిపారు.

## పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కష్టాలు

- ఉన్న ఇల్లు పీకి పందిరేసారు
- ఓపెన్ కాని ఇందిరమ్మ యాప్
- 5 పంచాయతీలలో నిలిచిన నిర్మాణాలు
- లబ్ధిదారులలో ఆందోళన



చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్) : పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కష్టాలు మొదలయ్యాయి. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది వారి పరిస్థితి. ఇల్లు మంజూరయి అధికారులు పట్టాలను అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవు. ఇన్నాళ్లూ ఉన్న పాత ఇళ్లను తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సమాయత్తమయ్యారు. పాత ఇంటి పక్కనే తాత్కాలికంగా చిన్న షెడ్లు వేసుకొని సేద దీరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కేంద్రం నుండి వచ్చే నిధులకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్ చేసారు. చివరి మజిలీగా లబ్దిదారుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఇందిరమ్మ యాప్‌లో అప్ లోడ్ చేయాల్సి ఉండగా ఈ లోగా మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల యాప్‌లు లాగిన్ కాకుండా మొరాయించాయి. ఇలా చర్ల పంచాయతీలో 69 ఇళ్లు, చిన్నమిడిసిలేరు పంచాయతీలో 24, కేశవాపురం పంచాయతీలో 34, పులిగుండాల పంచాయతీలో 13, కుదునూరు గ్రామ పంచాయతీలో 17 ఇళ్లు ప్రారంభానికి ముందే బ్రేకులు పడ్డాయి. వీటికి సంబంధించిన వివరాలు యాప్ లో అప్ లోడ్ అయిన తర్వాతనే సంబంధిత అదికారులు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ ప్రాంతం వద్దకు వెళ్లి ముగ్గుపోయాల్సి ఉంటుంది. అనంతరం బేస్ మెంట్ లెవల్ కు వచ్చిన తర్వాత గ్రామ కార్యదర్శులు ఫోటో తీసి అప్ లోడ్ చేసిన అనంతరం మొదటి విడతగా రూ.లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి. ఈ నేపథ్యంలో ఆదిలోనే యాప్ కారణంగా నిర్మాణాలు ముగ్గు దశలోనే నిలిచిపోయాయి. ఈ క్రమంలో పాత ఇంటిని తొలగించిన లబ్ధిదారులు వర్షాకాలం పిల్లా పాపలతో చిన్న షెడ్డులో నివాసం ఉంటూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. యాప్ విషయమై జిల్లా ఉన్నతాదికారులకు స్థానిక అధికారులు ఎన్నిమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అధికారులు ఇప్పటికయినా యాప్ సమస్యను పరిష్కరించి ఇల్ల నిర్మాణాలు సజావుగా సాగేలా చూసి తమ ఇబ్బందులు తొలగించాలని లబ్దిదారులు కోరుతున్నారు. కాగా లబ్దిదారుల పడుతున్న ఇబ్బందులను బుధవారం చర్ల పర్యటనకు వచ్చిన భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు దృష్టికి 'మనం' తీసుకువెళ్లగా స్పందించిన ఎం ఎల్ ఏ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి ఫోన్ చేసి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

## నిబద్ధత గల నాయకున్ని కోల్పోయాం

- అయోధ్యకు సిపిఐ నేతల ఘన నివాళి



ఖమ్మం, ఆగష్టు 6(మనం న్యూస్): సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొల్లోజు అయోధ్య మరణంతో కమ్యూనిస్టు పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందని సిపిఐ నేతలు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఐ నాయకుడు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్కు తీసుకు వచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, పోకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దాబ్బాయి), సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఎస్కె సాబీర్‌పాషా, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు అయోధ్య పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే ఎర్ర జెండా పట్టిన అయోధ్య తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే పని చేశారని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన నాయకుడన్నారు. అనేక అటుపోట్లను తట్టుకుని నిలబడిన అయోధ్య భూ పోరాటంలో పాల్గొని వందలాది ఎకరాల భూ పంపిణీ చేశారని ఆయన తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మణుగూరు ప్రాంతంలోని -వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నిర్మాణం కోసం అయోధ్య విశేష కృషి చేశారని ఆయన తెలిపారు. 1980 దశకంలో అప్పటి పీపుల్స్ వార్ బెదిరింపులకు సైతం అయోధ్య భయపడలేదని హేమంతరావు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ముందు వరుసలో నిలిచేవారని సమస్యల పరిష్కారం కోసం తాను ఎంచుకున్న మార్గంలో తుదివరకు పోరాడే వారన్నారు. ఆయన మరణం పేద ప్రజలకు, హక్కుల కోసం పోరాడే వారికి తీవ్ర నష్టమని ఆయన తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితమవుతామన్నారు. నివాళులర్పించిన వారిలో పోకాలపాటి లలిత రాజేశ్వరి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, మిరియాల రంగయ్య, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ముత్యాల సత్యనారాయణ, పలువురు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు ఉన్నారు.

# టీమిండియా నేర్చుకోవాల్సిన పాఠాలు!

అనుభవం లేని ఆటగాళ్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్ఇండియా ఐదు టెస్టుల సిరీస్ ను 2-2తో ముగించింది. సీనియర్లు లేకుండా, కొత్త సారథి నాయకత్వంలో టీమ్ఇండియా ఈ స్థాయి ప్రదర్శన చేయడం గొప్ప విషయమే. అయితే, ఈ టూర్ ద్వారా భారత జట్టు కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరముంది. అవేంటంటే?

**ఓపెనర్లు ఓకే.. ఇద్దరూ కలిస్తేనే..**

ఇంగ్లాండ్ సిరీస్ లో మన ఓపెనర్లు రాణించారు కానీ.. కలిసికట్టుగా కాదు. కేఎల్ రాహుల్ (534), యశస్వి జైస్వాల్ (411) వ్యక్తిగతంగా మంచి ప్రదర్శనే చేశారు. కానీ, ఒకరు బాగా ఆడితే మరొకరు తొందరగా పెవిలియన్ చేరారు. ఐదు మ్యాచ్ ల్లో ఒక్కసారి కూడా తొలి వికెట్ కు 100కుపైగా భాగస్వామ్యం నమోదు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 6 ఇన్నింగ్స్ ల్లో జట్టు స్కోరు 20 కూడా దాటకముందే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ల వ్యక్తిగత ప్రదర్శన కంటే భారీ భాగస్వామ్యాలు చేయాలి. దీనిపై జట్టు మేనేజ్ మెంట్ దృష్టి సారించాలి.

సిరీస్ లో వన్'డౌన్' ఇబ్బంది ఐదు టెస్టుల్లోనూ కొనసాగింది. మూడో స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ ఒక్కసారి కూడా భారీ ఇన్నింగ్స్ ఆడింది లేదు. మూడు మ్యాచ్ ల్లో వన్ డౌన్ లో వచ్చిన సుదర్శన్ స్కోర్లు 0, 30, 61, 0, 38, 11. కరుణ్ నాయర్ రెండు మ్యాచ్ ల్లో ఆ స్థానంలో వచ్చి చేసిన అత్యధిక స్కోరు 40. వీరు కుదురుకోరనిపిస్తే.. వేరే ఆటగాళ్లను ప్రయత్నించే ఆలోచన చేయాలి. లేదంటే దేశవాళీలో టాప్ ఆర్డర్ లో బాగా ఆడిన అనుభవం ఉన్న రుతురాజ్ గైక్వాడ్, దేవ్ దత్ పడిక్కల్, అభిమన్యు ఈశ్వరన్, నారాయణ్ జగదీశన్ లాంటి ఆటగాళ్లను పరిశీలించొచ్చు.

**మరో అగ్రెసివ్ వెపన్?**

టెస్టుల్లో రిషబ్ పంత్ ఆట గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పరిస్థితులెలా ఉన్నా ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతాడు. ముఖ్యంగా విదేశీ గడ్డపై టెస్టులంటే పూనకం వచ్చేస్తుంది. ఈసారి ఇంగ్లాండ్ పర్యటనలోనూ పంత్ అదే జోరు కొనసాగించాడు. తొలి టెస్టులో రెండు సెంచరీలు బాదేసిన అతను తర్వాత ఆడిన మూడు టెస్టుల్లోనూ రాణించాడు. ఆఖరి రెండు టెస్టుల్లో మాత్రం ఆ జోరు మిస్సయ్యాం. నాలుగో టెస్టు ఆడినా గాయం కారణంగా అగ్రెసివ్ పంత్ ను చూడలేకపోయాం. ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ జట్టులో మరొకరు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వంటి దూకుడు ఉన్న యువ ఆటగాళ్లను ట్రై చేయొచ్చు. లేదంటే ఇప్పుడు రిజర్వ్ కీపర్ గా ఉన్న ధ్రువ్ జురెల్ ఆ బాధ్యత తీసుకునేలా చేయాలి.



**ఆ ఒక్కడేనా? ఇంకా లేరా?**

టీమ్ఇండియా పేస్ ఆల్ రౌండర్ల సమస్యను ఎప్పట్నుంచో ఎదుర్కొంటోంది. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో రాణించిన పేస్ ఆల్ రౌండర్ నితీశ్ రెడ్డి.. ఇంగ్లాండ్ పర్యటనలో రాణిస్తాడు అనుకుంటే గాయం కారణంగా మధ్యలోనే దూరమయ్యాడు. నితీశ్ జట్టుకు దూరమైనప్పుడు భారత్ కు పేస్ ఆల్ రౌండర్ ప్రత్యామ్నాయం కనిపించలేదంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కొంతమంది ఆటగాళ్లు దేశవాళీలో మెరుస్తున్నా.. జాతీయ జట్టు తలుపు తట్టలేకపోతున్నారు. ఈ క్రమంలో జట్టు యాజమాన్యం, బీసీసీఐ గట్టి ప్రయత్నాలే చేయాల్సి ఉంది. శార్దూల్ ఠాకూర్ రూపంలో ఓ పేస్ ఆల్ రౌండర్ ఉన్నా.. అంతర్జాతీయ స్థాయిలో తేలిపోతున్నాడు. ఈ క్రమంలో 'నైట్ వాచ్ మ్యాన్' ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా పేర్లు చర్చకు వస్తున్నాయి.



**మూడో పేసర్ ఎవరు?**

టీమ్ఇండియాకు బుమ్రా, షమి, సిరాజ్ రూపంలో ముగ్గురు ప్రధాన పేసర్లున్నారు. అయితే, ఈ మధ్యకాలంలో ఈ ముగ్గురూ కలిసి ఆడిన సందర్భాలు తక్కువ. బుమ్రా, షమిలో ఎవరో ఒకరు గాయపడి జట్టుకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ పర్యటనలో షమి లేకపోవడంతో భారత్ కు మూడో పేసర్ కష్టం కొనసాగింది. ఆ స్థానంలో వచ్చిన ప్రసిద్ధ్, ఆకాశ్ దీప్ కొన్ని వికెట్లు తీసినా.. పరుగులు ఎక్కువగా ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో మూడో పేసర్ స్థానంలో బలమైన బౌలర్ కావాలి. అప్పుడు మిగిలిన ప్రధాన పేసర్లపై పనిభారమూ తగ్గుతుంది. దీనికోసం ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్ దీప్ సింగ్, ముకేశ్ కుమార్ లాంటివాళ్లపై ఫోకస్ పెట్టాలి.

## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్..
## టీ20ల్లో తొలి బౌలర్‌గా రికార్డు

అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 క్రికెట్ లో అద్భుతమైన రికార్డు సాధించాడు. పొట్టి ఫార్మాట్ క్రికెట్ లో 650 వికెట్లు తీసిన తొలి బౌలర్ గా రికార్డులకెక్కాడు. ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్ ఆరంభ మ్యాచ్ లో ఈ ఘనతను సాధించాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ ఖాన్ లండన్ స్పిరిట్ తో జరిగిన లీగ్ ఆరంభ పోరులో విజృంభించాడు. 20 బంతుల్లో (3/11) అదరగొట్టాడు. 15 డాట్ బాల్స్ చేసిన రషీద్ వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్ ను ఔట్ చేశాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్ జట్టు 94 బంతుల్లో 84 పరుగులే చేసి ఆలౌటైంది. ఆ జట్టుకు ఆడుతున్న స్టార్ బ్యాటర్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) విఫలమయ్యారు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ 4 వికెట్లు కోల్పోయి 31 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.



**టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు**

రషీద్ ఖాన్ 651 (478 ఇన్నింగ్స్‌లు)
డ్వేన్ బ్రావో 631 (546 ఇన్నింగ్స్‌లు)
సునీల్ నరైన్ 589 (544 ఇన్నింగ్స్‌లు)
ఇమ్రాన్ తహీర్ 547 (417 ఇన్నింగ్స్‌లు)
షకీబ్ అల్ హసన్ 498 (443 ఇన్నింగ్స్‌లు)
ఆండ్రీ రస్సెల్ 485 (497 ఇన్నింగ్స్‌లు)
క్రిస్ జోర్డాన్ 436 (404 ఇన్నింగ్స్‌లు)
వహాబ్ రియాజ్ 413 (344 ఇన్నింగ్స్‌లు)

## సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై స్పందించను: చిరంజీవి

సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ పై తాను మాట్లాడకపోయినా తాను చేసిన మంచి మాట్లాడుతుందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కు చిరంజీవి, తేజా సజ్జా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రక్తదానం గొప్పతనాన్ని వివరించారు. ఒక జర్నలిస్ట్ మూలంగా తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చిందని ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. ఆయన రాసిన ఆర్టికల్ చదివిన తర్వాతే తనకు ఈ ఆలోచన వచ్చిందన్నారు. ఆయనను ఇప్పటివరకూ చూడలేదు కానీ, ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటానని అన్నారు.

''ఈ అద్భుతమైన కార్యక్రమానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు. బ్లడ్ డొనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజ సజ్జాకు కూడా థాంక్యూ. రక్తదానం అనే పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా మీతో ఒక విషయం పంచుకోవాలని అనుకుంటున్నాను. నేను కొన్ని రోజులుగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలు అన్నారు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురుతిరిగింది. 'చిరంజీవిని అన్నన్ని మాటలు అనాలని మీకు ఎందుకు అనిపించింది' అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఆ వీడియో చూసి ఆమె గురించి వివరాలు కనుక్కొన్నాను. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది''.

''సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై ఎందుకు స్పందించరు అని అందరూ అడుగుతారు. నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేసిన మంచి కార్యక్రమాలు, నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. ఇది సత్యం. ఆ మహిళ మాట్లాడిన తర్వాత సదరు రాజకీయ నాయకుడు ఎక్కడా నా గురించి తప్పుగా మాట్లాడలేదు. వాళ్లకు కూడా మనసు ఉంటుంది కదా. ఆ క్షణంలో కోపంలో నన్ను తిట్టినా.. ఇంటికి వెళ్లాక వాళ్ల భార్య అయినా మరోసారి ఇలా మాట్లాడొద్దు అని చెబుతుంది'' అని చెప్పారు.

''మనం మాట్లాడాల్సిన అవసరం లేదు. మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. అంత అవసరం కూడా నాకు లేదు. మంచి చేసుకుంటూ వెళ్తాను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లో ఉన్న అభిమానులు కూడా నా మాటను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేస్తున్నారు. నా పేరును మరింత ముందుకు తీసుకువెళ్తున్నారు. వాళ్లందరికీ అభినందనలు'' అని చిరంజీవి తెలిపారు.



**చిరు - అనీల్ ప్రాజెక్ట్ టైటిల్ గ్లింప్స్ వచ్చేస్తుంది!?**

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు అనీల్ రావిపూడితో చేస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ కూడా ఒకటి. మెగాస్టార్ కెరీర్ 157వ సినిమాగా ప్లాన్ చేసిన ఈ ప్రాజెక్ట్ పై మంచి బజ్ ఉంది. ఇక అనీల్ ఆల్రెడీ తన మార్క్ ప్రమోషన్స్ ని కూడా చేస్తుండగా ఈ సినిమా తాలూకా టైటిల్ గ్లింప్స్ ఇంకా ఫస్ట్ లుక్ పై లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది.

దీని ప్రకారం మెగాస్టార్ సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ లు ఈ ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు కానుకగా అందిస్తున్నట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. మెగా అభిమానులకి బాగా కనెక్ట్ అయ్యే సూపర్ టైటిల్ ని అనీల్ లాక్ చేశారట. మరి అదేంటి అనేది తెలియాలి అంటే ఈ 22 వరకు ఆగాల్సిందే. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా నయనతార నటిస్తుండగా భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే సాహు గారపాటి నిర్మాణం వహిస్తున్నారు.

## లంకా దహనం చేయనున్న సీత..




టాలీవుడ్ స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఘాటి' ఎప్పుడో రావాల్సి ఉంది. కానీ ఈ చిత్రం పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేసిన ఈ క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో అనుష్క నెవర్ బిఫోర్ పాత్రలో నటిస్తుంది. పూర్తి వయొలెన్స్ చిత్రంగా ఈ సినిమాను క్రిష్ రూపొందించినట్లు ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి థియేట్రికల్ ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ లో ఉన్నదానికంటే ఎక్కువ వయొలెన్స్ ఈ ట్రైలర్ లో చూపెట్టారు. దీంతో ఈ సినిమాతో క్రిష్ మనకు ఎలాంటి ట్రీట్ ఇవ్వబోతున్నాడో అర్థమవుతుంది. ఇక గంజాయి సరఫరా చేసే పాత్రలో అనుష్క రస్టిక్ పర్ఫార్మెన్స్ తో ఇరగదీసింది. ఈ ట్రైలర్ లో ఆమె పర్ఫార్మెన్స్ శాంపిల్ మాత్రమే మనకు చూపెట్టారు. కథలో లోతు.. దానికి తగ్గ ఎమోషన్స్.. వాటికి అదనంగా యాక్షన్ కలగలిపి ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించనున్నారు.

మొత్తానికి అనుష్క ఫ్యాన్స్ ఎంతోకాలంగా వెయిట్ చేస్తున్న సినిమా ఎట్టకేలకు వారి ముందుకు రాబోతుంది. ఈ సినిమాలో విక్రమ్ ప్రభుతో పాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాగర్ నాగవెల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను సెప్టెంబర్ 5న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

### 64 ఏళ్ల హీరో.. 32 ఏళ్ల హీరోయిన్
## కామెంట్‌పై ఫైర్ అయిన మాళవిక

పాన్ ఇండియా కథానాయకగా పేరు తెచ్చుకున్న నటి మాళవిక మోహన్. ముఖ్యంగా మలయాళం తమిళం తెలుగు భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈమె ఏ తరహా పాత్రలోనైనా ఒదిగిపోయి నటించగల సత్తా కలిగిన నటి. ప్రస్తుతం ఈమె తమిళంలో కార్తీ కథానాయకుడుగా నటిస్తున్న సర్దార్ 2 చిత్రంలోనూ, తెలుగులో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ది రాజా సాబ్ చిత్రంలోనూ నటిస్తున్నారు. కాగా సోమవారం నటి మాళవిక మోహన్ పుట్టినరోజు ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ది రాజాసాబ్ చిత్రం యూనిట్, సర్దార్ 2 చిత్ర యూనిట్ ప్రత్యేక పోస్టల్ విడుదల చేశారు.

కాగా 32 ఏళ్లు టచ్ చేసిన మాళవిక మోహన్ మలయాళంలో మోహన్ లాల్ కు జంటగా హృదయ పూర్వం అనే చిత్రంలో నటిస్తున్నారు. కాగా మోహన్ లాల్ వయసు 64 ఏళ్లు ఆయనకు జంటగా 32 ఏళ్ల మాళవిక మోహన్ నటించడంతో సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు. వాటిపై స్పందించిన మాళవిక మోహన్ నటీనటుల వయసు గురించి గానీ, వయసు వ్యత్యాసం గురించి గానీ మాట్లాడకండి అంటూ హెచ్చరించారు.

ముందు ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం ఆపేయండి అంటూ సినిమాలో ప్రతిభను చూడాలి గానీ అర్థం లేని విషయాల గురించి ఆరాలు తీయరాదనే అభిప్రాయాన్ని మాళవిక మోహన్ వ్యక్తం చేశారు.



# డేవిడ్ రెడ్డిగా మంచు హీరో!




మంచు వారి కుటుంబం నుంచి వచ్చిన టాలెంటెడ్ హీరోస్ ఇద్దరి నుంచి ఈ ఏడాది భైరవం, కన్నప్ప చిత్రాలు వరుసగా వచ్చాయి. ఇక మంచు విష్ణు కన్నప్ప తర్వాత తదుపరి సినిమా ఇంకా అనౌన్స్ చేయలేదు కానీ మంచు మనోజ్ నుంచి మాత్రం సాలిడ్ ప్రాజెక్ట్ ఇప్పుడు అనౌన్స్ అయ్యింది. ఒక భారీ పీరియాడిక్ డ్రామా తన నుంచి డేవిడ్ రెడ్డి గా అనౌన్స్ చేయడం జరిగింది. తన 21 ఏళ్ల సినీ కెరీర్లో తన 21వ ప్రాజెక్ట్ గా ఈ సినిమా తనకెంతో ప్రత్యేకం అని మనోజ్ చెబుతున్నాడు. దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న ఈ సినిమా బ్రిటీష్ కాలం నాటి నేపథ్యంలో ప్లాన్ చేస్తున్నారు. 1897 నుంచి 1922 కాలంలో కథగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి మంచు మనోజ్ నుంచి ఈ బిగ్ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి వెల్వెట్ సోల్, టూర్ రాడిక్స్ సంస్థలు నిర్మాణం వహిస్తుండగా ఇతర వివరాలు త్వరలోనే బయటకి రానున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.